సాక్షి
పశ్చిమగోదావరి

బుధవారం । 18 । అక్టోబర్ । 2023



అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యం

అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన ఉందని ప్రెస్ అకాడమీ చైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు అన్నారు. IIలో ▸



పసిడి పరుగులు

ఇజ్రాయెల్ యుద్ధం ప్రభావంతో బంగారం ధరలు జోరు మీదున్నాయి. ధరలు ఇప్పట్లో తగ్గే అవకాశం కనిపించడం లేదు. ప్రస్తుతం ఆల్‌టైం హైలో కొనసాగుతున్నాయి. IIలో ▸



హ్యాండ్‌బాల్‌లో సత్తా

కడపలోని జరిగిన హ్యాండ్‌బాల్ పోటీల్లో ఉమ్మడి పశ్చిమ సీనియర్ మహిళల, బాలుర జట్లు సత్తా చాటాయి. వారిని రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేశారు. IIలో ▸

కౌలు రైతుకు రుణ భరోసా

- ఇంతవరకూ 38 వేల మందికి రుణాలు
- రూ.246.11 కోట్లు అందజేత
- ఎకరాకు రూ.38 వేల నుంచి రూ.42 వేల వరకు రుణం



వేంద్ర కెనరా బ్యాంకులో సీసీఆర్ కార్డు ద్వారా రుణాలు పొందుతున్న రైతులు

భీమవరం (ప్రకాశంచౌక్): అన్నదాతల సంక్షేమమే లక్ష్యంగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి రైతులను అన్ని విధాలుగా ఆదుకుంటున్నారు. ముఖ్యంగా కౌలు రైతులకు భరోసాగా నిలుస్తూ భూమి కలిగిన రైతులతోపాటు కౌలు రైతులకు కూడా అన్ని సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారు. అందులో భాగంగా కౌలు రైతులకు సీసీఆర్ కార్డులు (11 నెలల పాటు చెల్లేలా) అందించి వాటి ద్వారా బ్యాంకు రుణాలను సకాలంలో అందిస్తున్నారు. కౌలు రైతులు పెట్టుబడికి ఇబ్బంది పడకుండా సీసీఆర్ కార్డులు ఉపయోగించుకుని రుణాలు పొందేలా సౌకర్యాన్ని ప్రభుత్వం కల్పించింది. బ్యాంకులకు వెళ్లి నేరుగా సీసీఆర్ కార్డు సమర్పించి పంటకు రుణాలు పొందే అవకాశం కేవలం రాష్ట్రంలో మాత్రమే ఉంది. సీసీఆర్ కార్డుల మీద కేవలం రుణాలేకాకుండా పంట నష్టం, రైతు భరోసా పథకాలను కూడా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్నారు.

రూ.246.11 కోట్ల మేర రుణాలు : పశ్చిమగోదావరి జిల్లాలో మొత్తం 87 వేల మంది కౌలు రైతులకు సీసీఆర్ కార్డులు మంజూరు చేశారు. అందులో ఇంత వరకూ 38 వేల మంది కౌలు రైతులకు రూ.246.11 కోట్ల రుణాలను బ్యాంకులు అందించాయి. మిగిలిన రైతులు సీసీఆర్ కార్డుల ద్వారా రుణాలు పొందుతున్నారు. కమర్షియల్ బ్యాంకుల నుంచి సహకార బ్యాంకుల వరకూ కౌలు రైతులకు రుణాలు మంజూరు చేస్తున్నాయి. ఎకరాకు రూ.38 వేల నుంచి రూ.42 వేలు స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ప్రకారం అందిస్తున్నాయి. ఎలాంటి గ్యారంటీ , పూచికత్తు లేకుండా కౌలు రైతులకు పంట రుణాలు మంజూరు చేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంది. జిల్లాలో 87 వేల మందికి సీసీఆర్ కార్డులు మంజూరు చేసిన నేపథ్యంలో 60 శాతం మేర రుణాలు అందించడమే లక్ష్యంగా అధికారులు పనిచేస్తున్నారు.

కౌలు రైతుల హర్షం

సీసీఆర్ కార్డుల ద్వారా బ్యాంకులు సకాలంలో పంట రుణాలు అందించడంపై కౌలు రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. పెట్టుబడికోసం అప్పులు చేయాల్సిన అవసరం లేకుండా ప్రభుత్వం బ్యాంకుల్లో తక్కువ వడ్డీకే పంట రుణాలు ఇప్పించడం చాలా సంతోషంగా ఉందంటున్నారు. గతంలో వ్యవసాయానికి పెట్టుబడి కోసం ధాన్యం కమిషన్ వ్యాపారుల వద్ద, ప్రైవేటు వ్యక్తుల వద్ద అప్పులు చేసుకుని వ్యవసాయం చేసేవారమని దాంతో అధిక వడ్డీతో అప్పు తిరిగి చెల్లించడానికి ఇబ్బందులు పడేవారమని, నేడు అప్పుల బాధ లేకుండా వెంటనే బ్యాంకు రుణాలు లభిస్తున్నాయని అంటున్నారు.

చంద్రబాబు పాలనలో ఇబ్బందులు

గత చంద్రబాబు పాలన కౌలు రైతులకు గడ్డుకాలంగా సాగింది. కేవలం రైతు మిత్ర గ్రూపులు ఉంటేనే కౌలు రైతులకు రుణాలు మంజూరు చేసేవారు. సీసీఆర్ కార్డు చంద్రబాబు పాలనలో కౌలు రైతులకు తెలిసే పరిస్థితి లేదు. దాంతో కౌలు రైతులు వ్యవసాయానికి పెట్టుబడి కోసం తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ప్రభుత్వం నుంచి ఎలాంటి సాయం లేకపోవడంతో కౌలు రైతులు వ్యవసాయం చేసి తీవ్ర అప్పులపాలయ్యారు.

రూ.3,819 కోట్లు రుణం మంజూరు

జిల్లాలో అన్ని రకాల రైతులను కలుపుకొని 2,26,734 మంది రైతులకు ఈ ఏడాది ఖరీఫ్ సాగుకు సంబంధించి ఇప్పటి వరకూ రూ.3,819 కోట్లు రుణాలను బ్యాంకులు మంజూరు చేశాయి. ఖరీఫ్‌కు రూ.38 వేల నుంచి 42 వేలు, రబీకి రూ.42 వేల నుంచి రూ.45 వేలు ఇచ్చారు.

సీసీఆర్ కార్డుతో కౌలు రైతులకు మేలు



“ ప్రభుత్వం 11 నెలల కాలానికి అందిస్తున్న సీసీఆర్ కార్డుల ద్వారా కౌలు రైతులకు ఎంతో మేలు జరుగుతుంది. నేను పాలకోడేరు బ్యాంక్ ఆఫ్ ఇండియాలో సీసీఆర్ కార్డుపై ఏటా రూ.85 వేలు రుణం పొందుతున్నాను. ఈ ఏడాది రూ.85 వేలు సీసీఆర్ కార్డుపై తీసుకున్నాను.

– పి.చిన వెంకన్న, పాలకోడేరు

రూ. 60 వేల రుణం ఇచ్చారు



తుందుర్రులో 2 ఎకరాలు కౌలు చేస్తున్నాను. ఈ ఏడాది ఖరీఫ్‌కు సంబంధించి రూ.60 వేలు తుందుర్రు యూనియన్ బ్యాంకు పంట రుణం తీసుకున్నాను. సకాలంలోనే పంట రుణం అందించడంతో పెట్టుబడికి ఇబ్బంది లేకుండా సాగు చేస్తున్నాను. 2019 నుంచి నేను సీసీఆర్ కార్డుతో బ్యాంకు రుణాలు పొందుతున్నాను.

– పి.డేవిడ్ రాజు, కౌలు రైతు తుందుర్రు

ఇంతవరకు రూ. 246.11 కోట్ల రుణం



సీసీఆర్ కార్డులు కలిగిన కౌలు రైతులకు ఇంతవరకూ అన్ని బ్యాంకుల ద్వారా రూ.246.11 కోట్ల రుణాలను అందించాం. కౌలు రైతులకు బ్యాంకులు విరివిగా రుణాలు మంజూరు చేస్తూనే ఉన్నాయి. సీసీఆర్ కార్డుల ద్వారా గాని లేదా జేఎల్‌జీ గ్రూపులుగా ఏర్పడి పంట రుణాలను బ్యాంకుల నుంచి పొందవచ్చు.

– నాగేంద్ర ప్రసాద్, లీడ్ బ్యాంక్ మేనేజర్

ధాన్యం కొనుగోలుకు ఏర్పాట్లు ముమ్మరం చేయాలి

కలెక్టర్ పి.ప్రశాంతి



అలంపురం రైతు భరోసా కేంద్రంలో మాట్లాడుతున్న కలెక్టర్ పి.ప్రశాంతి

పెంటపాడు: ఖరీఫ్‌లో ధాన్యం సేకరణకు సంబంధించి రైతులకు ఇబ్బందులు లేకుండా పక్కాగా ఏర్పాట్లు పూర్తి చేయాలని కలెక్టర్ పి.ప్రశాంతి పేర్కొన్నారు. మంగళవారం పెంటపాడు మండలం అలంపురం రైతుభరోసా కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ధాన్యం కొనుగోలుకు సంబంధించి అందుబాటులో ఉన్న పరికరాలను పరిశీలించారు. మరో వారం పది రోజులలో ధాన్యం రానున్న దృష్ట్యా జిల్లాలోని ప్రతి ఆర్బీకే సెంటర్‌లో సిబ్బంది ఉత్సాహంగా పనిచేయాలన్నారు. గత అనుభవాల దృష్ట్యా ప్రధానంగా రైతులకు ఇబ్బంది రాకుండా చర్యలు తీసుకోవాలని ఆర్డీవో చెన్నయ్య, జిల్లా పంచాయతీ అధికారి జీవీకే మల్లికార్జునరావు, వ్యవసాయాధికారి జెడ్.వెంకటేశ్వరరావు, వ్యవసాయసలహామండలి అధ్యక్షుడు కైగాల శ్రీనివాస్‌ను ఆదేశించారు. రైతులకు గిట్టుబాటు ధర కల్పించడమే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమన్నారు. రైతులకు కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు సరైన అవగాహన కల్పించి విస్తృత ప్రచారం చేయాలన్నారు. దర్శిపర్రు, అలంపురం తదితర సొసైటీల అధ్యక్షులు గుండుమోగుల సాంబయ్య, కొలనువాడ సత్యనారాయణ రాజు(దత్తుడు)లు సంచుల కొరత లేకుండా చేయాలని కలెక్టర్‌ను కోరారు.

న్యూస్‌రీల్

బీమా సొమ్ము అందజేత



పడమటిపాలెంలో బీమా సొమ్ము పత్రాన్ని అందిస్తున్న చీఫ్ విప్ ప్రసాదరాజు

నరసాపురం రూరల్: ఆరోగ్యశ్రీ పేరు చెప్పగానే మొదటిగా గుర్తొచ్చేది స్వర్గీయ వైయస్ రాజశేఖర్‌రెడ్డి పేరే నని ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రాదరాజు అన్నారు. మొగల్తూరు గ్రామం పడమటిపాలెంకు చెందిన కటికిరెడ్డి సత్యనారాయణ గతంలో ప్రమాదవశాత్తూ చెరువులోపడి మరణించడంతో ప్రభుత్వం నుంచి మంజూరైన 5 లక్షల బీమా సొమ్ము పత్రాన్ని వారి కుటుంబ సభ్యులకు ప్రసాదరాజు మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంతవరకూ 765 మందికి సుమారు రూ.4 కోట్లు సీఎం సహాయనిధి ద్వారా అందజేశామన్నారు. రుస్తుంబాదలో జరిగిన కార్యక్రమంలో హైదరాబాద్ రెయిన్‌బో ఆసుపత్రిలో అనారోగ్యంతో చికిత్స పొందుతున్న పసలదీవి గ్రామానికి చెందిన కొట్టు యువన్ శ్రీకృష్ణసాయిజైవిఠల్ వైద్య ఖర్చుల నిమిత్తం సీఎం సహాయ నిధి నుంచి మంజూరైన రూ .5లక్షల ఎల్‌వోసీ లేఖను కుటుంబ సభ్యులకు అందజేశారు.

29న మిస్టర్ ఆంధ్రా పోటీలు

సాక్షి, భీమవరం: భీమవరం పట్టణంలోని శ్రీకృష్ణదేవరాయ కల్యాణ మండపంలో ఈనెల 29న మిస్టర్ ఆంధ్రా బాడీబిల్డింగ్ పోటీలు నిర్వహించనున్నట్లు బాడీబిల్డింగ్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కఠారి రవిశంకర్, షేక్ ఖాసిం చెప్పారు. దీనికి ఈ నెల 22న పట్టణంలోని కే 12 జిమ్‌లో జిల్లా టీం సెలక్షన్స్ నిర్వహిస్తామన్నారు. బాడీ బిల్డర్స్, ఫిజిక్ మోడలింగ్, మాస్టార్స్, దివ్యాంగులు పాల్గొనవచ్చునన్నారు. ఇతర వివరాలకు 6281333159 నెంబరులో సంప్రదించాలని కోరారు.

డీఈఎల్ఈడీ ఫలితాల వెల్లడి

ఏలూరు (ఆర్ఆర్‌పేట): గత ఆగస్టులో ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా పరిధిలో నిర్వహించిన డీఈఎల్ఈడీ ద్వితీయ సంవత్సరం సప్లిమెంటరీ పరీక్షల ఫలితాలు మంగళవారం విడుదలయ్యాయని జిల్లా విద్యాశాఖాధికారి పీ.శ్యామ్ సుందర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పరీక్షల్లో ఉత్తీర్ణులైన అభ్యర్థుల డమ్మీ మార్కుల మెమోలు బీఎస్ఈ ఏపీ వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చని సూచించారు. అభ్యర్థులు రీకౌంటింగ్‌కు సబ్జెక్టుకు రూ.500 సీఎఫ్ఎంఎస్ చలానా ద్వారా చెల్లించాలని, రీకౌంటింగ్ దరఖాస్తుతో పాటు సీఎఫ్ఎంఎస్ చలానా, డమ్మీ మార్కుల మెమో, స్వంత చిరునామా ఉన్న కవర్‌ను నేరుగా విజయవాడ గొల్లపూడిలోని ప్రభుత్వ పరీక్షల సంచాలకుల కార్యాలయానికి పంపాలన్నారు.

నరసాపురం, కాకినాడ నుంచి ప్రత్యేక రైళ్లు

నరసాపురం: దసరా రద్దీని దృష్టిలో పెట్టుకుని మరో 3 రైళ్లను సికింద్రాబాద్‌కు నడపుతున్నారు. ఒకటి నరసాపురం నుంచి నేరుగా సికింద్రాబాద్‌కు కాగా, మరో రెండు రైళ్లు కాకినాడ సికింద్రాబాద్ మధ్య వయా భీమవరం మీదుగా నడుస్తాయని నరసాపురం రైల్వేస్టేషన్ మేనేజర్ దివాకర్‌బాబు చెప్పారు. 07270 సర్వీస్ నెంబర్‌తో ఈనెల 19న సాయంత్రం 6 గంటలకు నరసాపురం నుంచి బయలుదేరి మరుసటిరోజు ఉదయం 4.50 గంటలకు సికింద్రాబాద్ చేరుకుంటుంది. 07271 సర్వీస్ నెంబర్‌తో ఈనెల 20న సికింద్రాబాద్‌లో రాత్రి 9 గంటలకు బయలుదేరి వయా భీమవరం మీదుగా మరుసటిరోజు ఉదయం 8 గంటలకు కాకినాడ చేరుకుంటుంది. 21న 07272 సర్వీస్ నెంబర్‌తో రాత్రి 8 గంటలకు కాకినాడలో బయలుదేరి మరుసటిరోజు ఉదయం 8.30 గంటలకు సికింద్రాబాద్ చేరుకుంటుందని చెప్పారు.

దూరవిద్య కోర్సుల్లో ప్రవేశాలకు గడువు పొడిగింపు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యా పీఠం ఆధ్వర్యంలో దూరవిద్యా విధానంలో నిర్వహించే 10వ తరగతి, ఇంటర్మీడియట్ కోర్సుల్లో ప్రవేశాలకు గడువు పొడిగించినట్లు జిల్లా విద్యాశాఖాధికారి పీ.శ్యామ్ సుందర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు అభ్యర్థులు ఈ నెల 31 వరకూ ఎలాంటి అపరాధ రుసుం లేకుండా ఆన్‌లైన్ ద్వారా ప్రవేశాలు పొందవచ్చన్నారు.

ఈవీఎంల చెకింగ్ పరిశీలన

ఏలూరు(మెట్రో): జిల్లాకు కేటాయించబడిన ఈవీఎంలు, వీవీ ప్యాట్స్‌ల ఫస్ట్ లెవెల్ చెకింగ్‌కు నియమించిన అధికారులు, సిబ్బంది వారికి ఇచ్చిన గుర్తింపు కార్డును తప్పనిసరిగా ధరించాలని కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ అధికారులను, సిబ్బందిని ఆదేశించారు. మంగళవారం ఫస్ట్ చెకింగ్ రెండో రోజైన మంగళవారం కలెక్టర్ గోడౌన్‌లో నిర్వహిస్తున్న చెకింగ్ ప్రక్రియను పరిశీలించారు. సిబ్బంది హాజరు పట్టికను, పోలీసు అధికారులు హాజరుపట్టికను పరిశీలించారు.

జగనన్న సురక్షతో అందరికీ ఆరోగ్యం

కలెక్టర్ పి.ప్రశాంతి



అలంపురంలో కంటి పరీక్షలను పరిశీలిస్తున్న కలెక్టర్ పి.ప్రశాంతి

పెంటపాడు: ప్రజలందరికీ ఆరోగ్యం అందించే మంచి లక్ష్యంతో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిందని, ప్రజలు సక్రమంగా వినియోగించుకోవాలని కలెక్టర్ పి.ప్రశాంతి పేర్కొన్నారు. పెంటపాడు మండలం అలంపురంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో మంగళవారం జరుగుతున్న జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆరోగ్యం సరిగాలేని పేదప్రజలు నాణ్యమైన మంచి వైద్యం చేయించుకొనేందుకు ఖర్చుకు భయపడి ముందుకు రావడం లేదన్నారు. కార్పొరేట్ ఆసుపత్రుల ద్వారా ఎక్కువగా డబ్బు ఖర్చుపెడుతున్నారన్నారు. దాని వల్ల తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. వారి కోసం రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపులు సద్వినియోగం చేసుకునేలా ఆశావర్కర్లు, ఏఎన్ఎంలు , వలంటీర్లు, అధికారులు కృషిచేయాలన్నారు. శిబిరాలలో నెట్‌వర్కు ఆసుపత్రుల లిస్టు ప్రజలకు అందుబాటులో ఉండేలా పెద్ద అక్షరాలతో తెలిపే బోర్డులను ఏర్పాటు చేయాలని డీఎంహెచ్‌వో మహేశ్వరరావును ఆదేశించారు. ఈ క్యాంపులలో వచ్చిన రోగులను ఆయా పీహెచ్‌సీల ద్వారా ఫాలో అప్ చేసేలా చూసే బాధ్యతను ప్రభుత్వ డాక్టర్లు తీసుకునేలా చూడాలని డీఎంహెచ్‌ఓను కోరారు. ఈ సందర్భంగా వైఎస్సార్ కంటివెలుగు ద్వారా కంటిపరీక్షలు నిర్వహించి కళ్లద్దాలు అవసరమైనవారికి అందించేలా చూడాలన్నారు. వృద్ధులకు కంటి పరీక్షలు చేస్తున్న డాక్టర్ రాజేంద్రప్రసాద్‌ను అభినందించారు. కార్యక్రమంలో ఆర్డీవో చెన్నయ్య, డీఎంహెచ్‌వో మహేశ్వరరావు, పెంటపాడు, ముదునూరు వైద్యాధికారులు తోట రాజేష్, వి.పూజిత, ఎంపీపీ దాసరి హైమావతి, సర్పంచ్ తాతపూడి ప్రగతి, జిల్లా వ్యవసాయ సలహామండలి అధ్యక్షుడు కైగాల శ్రీనివాస్, సొసైటీ అధ్యక్షుడు కొలనువాడ సత్యనారాయణరాజు (దత్తుడు), ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు సీహెచ్ దుర్గా భవాని, జీజీబీ విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

అన్నపూర్ణా పాహిమాం



భీమవరం(ప్రకాశంచౌక్): గాయిత్రీదేవి అలంకరణలో భీమవరం శ్రీమావుళ్లమ్మ అమ్మవారు

వాడవాడలా శ్రీదేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. మూడో రోజు అమ్మవారు అన్నపూర్ణదేవిగా, గాయత్రీ దేవిగా దర్శనమిచ్చారు. అమ్మవారి ఆలయాల్లో విశేష పూజలు జరిగాయి. భక్తులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

– సాక్షి, నెట్‌వర్క్



తాడేపల్లిగూడెం(టీపీసీ) : తాడేపల్లిగూడెం బలుసులమ్మ ఆలయంలో కాశీ అన్నపూర్ణదేవిగా విశేష అలంకరణ

రైతులకు ఇబ్బంది లేకుండా
ధాన్యం సేకరణ



కలెక్టరేట్‌లో ధాన్యం కొనుగోలు సమావేశంలో మాట్లాడుతున్న జేసీ రామ్‌సుందర్‌రెడ్డి

సాక్షి, భీమవరం: రైసు మిల్లర్స్ రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ధాన్యం సేకరణ చేపట్టాలని దీనికి అవసరమైన బ్యాంక్ గ్యారంటీలు, గోనె సంచులు మూడు రోజుల్లోగా సిద్ధం చేసుకోవాలి జాయింట్ కలెక్టర్ ఎస్.రామ్‌సుందర్‌రెడ్డి చెప్పారు. మంగళవారం భీమవరం కలెక్టరేట్‌లో సార్వా ధాన్యం సేకరణపై సివిల్ సప్లయిస్ అధికారులు, జిల్లా రైస్ మిల్లర్స్‌తో సమావేశం నిర్వహించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రస్తుత సీజన్‌లో అధికారులు, మిల్లర్లు సమష్టిగా పనిచేసి ధాన్యం కొనుగోలులో రైతులకు మంచి సేవలు అందించాలన్నారు. సార్వా సీజన్‌కు జిల్లాలో 314 రైతు భరోసా కేంద్రాల ద్వారా సుమారు 4.65 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు లక్ష్యంగా నిర్ణయించినట్లు రామ్‌సుందర్‌రెడ్డి వెల్లడించారు. దీనికి రైసు మిల్లర్లంతా ధాన్యం కొనుగోలుకు సరిపడా మిల్లుల వారీగా బ్యాంక్ గ్యారంటీలు, గొనె సంచులు సిద్ధం చేసుకోవాలన్నారు. గత రబీ సీజన్‌కు సంబంధించి 66 వేల మెట్రిక్ టన్నుల బియ్యం మిల్లర్లు ఇవ్వాల్సివుందని వాటిని వారం రోజుల్లోగా పూర్తి చేయాలని జేసీ ఆదేశించారు. ధాన్యం మద్దతు ధర గ్రేడ్-ఏ రకం క్వింటాల్ రూ.2,203, సాధారణ రకం క్వింటాల్ రూ.2,183 రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. ధాన్యం సేకరణలో కస్టోడియన్ అధికారులు పాత్ర ప్రధానమైనదని వారి సేవలు సక్రమంగా వినియోగించుకోవాలన్నారు. ధాన్యం సేకరణకు వినియోగించే రవాణా వాహనాలకు జీపీఎస్ ట్రాకింగ్ ఏర్పాటుకు చర్యలు తీసుకున్నామన్నారు. సమావేశంలో సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ జిల్లా మేనేజరు టి శివరామప్రసాద్, డీఎస్‌వో ఎన్ సరోజ, ఏఎస్‌వో ఎం.రవిశంకర్, జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ కార్యదర్శి కొత్త శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మళ్లీ పరీక్షలు రాసేలా అవగాహన కల్పించండి

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఇంటర్ ఫెయిలైన విద్యార్థులతో తిరిగి పరీక్షలు రాయించేలా సంబంధిత కళాశాలల ప్రతినిధులు చర్యలు తీసుకోవాలని ఇంటర్మీడియట్ ప్రాంతీయ తనిఖీ అధికారి కే.చంద్రశేఖర బాబు, జిల్లా వృత్తి విద్యా అధికారి బీ.ప్రభాకరరావు ఆదేశించారు. ఈ మేరకు మంగళవారం స్థానిక ఇంటర్మీడియట్ బోర్డు కార్యాలయం నుంచి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లాలోని అన్ని కళాశాలల యాజమాన్యాలకు తగిన సూచనలిచ్చారు. 2021-22, 2022-23 విద్యా సంవత్సరాల్లో ఫెయిలైన విద్యార్థులు తిరిగి ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరంలో చేరి రెగ్యులర్ విద్యార్థిగా మారే అవకాశం ఇంటర్మీడియట్ బోర్డు కల్పించిందన్నారు. వచ్చే మార్చిలో జరిగే పరీక్షలకు హాజరయ్యేందుకు ఆయా విద్యార్థులకు అవకాశం కల్పించారన్నారు. గత రెండు విద్యా సంవత్సరాల్లో ఫెయిలైన విద్యార్థుల వివరాలను తీసుకుని వారిని, వారి తల్లిదండ్రులను నేరుగా సంప్రదించి పరీక్ష ఫీజులు చెల్లించేలా సంబంధిత కళాశాలల అధ్యాపకులు, ప్రిన్సిపాల్స్ కృషి చేయాలన్నారు.

అధికారులు లక్ష్య సాధనకు కృషి చేయాలి



సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రశాంతి

భీమవరం(ప్రకాశం చౌక్): అధికారులు లక్ష్యసాధనకు కృషి చేయాలని కలెక్టరు పి.ప్రశాంతి అన్నారు. మంగళవారం స్థానిక జిల్లా కలెక్టరు కార్యాలయ వీడియో కాన్ఫరెన్స్ హాలు నుండి స్వమిత్వ, నాడు – నేడు పనులు, గ్రాస్ ఎన్‌రోల్‌మెంట్ రేషియో, గృహ నిర్మాణం, ప్రయారిటీ బిల్డింగ్స్ నాలుగు అంశాలపై డివిజన్, మండలాల వారీగా ప్రత్యేక అధికారులు, మండల స్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా కలెక్టరు సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టరు మాట్లాడుతూ లక్ష్యసాధనలో వెనుక బడిన మండలాల అధికారులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. జిల్లాలో ఇప్పటికే పూర్తయిన గృహాలలో మౌలిక వసతులను పూర్తిచేసి గహప్రవేశాలకు సిద్ధం చేయాలన్నారు. వివిధ దశల్లో నిర్మాణాల్లో ఉన్న ఇళ్లను త్వరగా పూర్తి చేయడానికి సంబంధిత అధికారులు, సిబ్బంది కృషి చేయాలన్నారు. లబ్ధిదారుల మనోభావాలకు అనుగుణంగా ఇళ్ళ నిర్మాణాలు పూర్తి చేయాలన్నారు. మనబడి నాడు – నేడు పనులపై సమీక్షిస్తూ ఇప్పటి వరకు పాఠశాలలు, అంగన్‌వాడీ భవనాలు, టాయిలెట్స్ నిర్మాణ పనులు పూర్తయిన వాటికి జమా ఖర్చుల వివరాలు సమర్పించాలన్నారు. పాఠశాలలో మిగిలిన పనుల త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ప్రభుత్వ భవనాలు ప్రగతిని మండలాల వారీగా అడిగి తెలుసుకుని, పూర్తయిన భవనాలు ప్రారంభోత్సవాలు జరిపి వాడుకలోకి తేవాలని కలెక్టరు ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో విద్యాశాఖ అధికారి ఆర్.వెంకట రమణ, గృహ నిర్మాణ శాఖ పీడీ డా.ఆర్సీ ఆనంద కుమార్, జిల్లా పంచాయతీ శాఖ అధికారి జీవీకె మల్లికార్జున రావు, జిల్లా పంచాయతీ రాజ్ ఇంజినీరింగు అధికారి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

చెకుముకి సైన్స్ సంబరాల పోస్టర్ ఆవిష్కరణ

చెకుముకి సైన్స్ సంబరాల పోస్టర్‌ను కలెక్టర్ పి.ప్రశాంతి, జాయింట్ కలెక్టర్ ఎస్.రాం సుందర్‌రెడ్డి జిల్లా విద్యాశాఖాధికారి ఆర్.వెంకటరమణ మంగళవారం ఆవిష్కరించారు. జన విజ్ఞాన వేదిక, విద్యాశాఖ సంయుక్తంగా నిర్వహిస్తున్న ఈ సంబరాలలో భాగంగా 8, 9, 10 తరగతి విద్యార్థులకు నిర్వహిస్తున్న ప్రతిభా పాటవ పరీక్షను అన్ని ఉన్నత పాఠశాలల్లో తప్పక జరపాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షుడు సీహెచ్ ప్రసాద రావు, జిల్లా కన్వీనర్ ఆర్.వెంకన్నబాబు, జిల్లా ప్రధాన కార్యదర్శి జె.రామ లక్ష్మణ రావు, సుకుమార్, జాతీయ బాలల సైన్స్ కాంగ్రెస్ జిల్లా సమన్వయాధికారి మల్లుల శ్రీనివాస్ పాల్గొన్నారు. చెకుముకి సంబరాలలో భాగంగా నవంబర్ 10న పాఠశాల స్థాయి పరీక్ష, నవంబర్ 30న మండల/పట్టణ స్థాయి పరీక్ష, డిసెంబర్ 17న జిల్లా స్థాయి పరీక్ష, జనవరి 27, 28న రాష్ట్ర స్థాయి పరీక్ష విశాఖపట్నంలో జరుగుతుందని తెలిపారు.

రైతులకు భూయాజమాన్య హక్కులు

భీమవరం(ప్రకాశం చౌక్): జిల్లాలో రైతులకు భూయాజమాన్య హక్కులు కల్పించే ప్రక్రియను పూర్తి చేశామని జాయింటు కలెక్టరు ఎస్.రామ్ సుందర్ రెడ్డి తెలిపారు. మంగళవారం స్థానిక జాయింటు కలెక్టరు చాంబరులో జాయింటు కలెక్టరు రైతులకు యాజమాన్య హక్కు కల్పించే ప్రక్రియను రెవెన్యూ సిబ్బందితో సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు 20 సంవత్సరాల పైబడిన అసైన్డ్ భూములు కలిగి ఉన్న రైతులను గుర్తించి వారికి యాజమాన్య హక్కులు కల్పిస్తామన్నారు. జిల్లాలో 79 గ్రామాలలోని అసైన్డ్ భూములు గుర్తించామని, 73 గ్రామాల రికార్డులు పరిశీలించి ఇప్పటికే ఆమోదించామన్నారు. నరసాపురం, యలమంచిలి, ఆచంట, పెంటపాడు మండలాల్లోని 6 గ్రామాలకు సంబంధించిన రికార్డులను మంగళవారం పరిశీలించామన్నారు.

ఆర్టీసీ స్థలాల లీజుపై 19న సదస్సు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఆర్టీసీ విజయవాడ జోన్ పరిధిలోని వివిధ బస్ స్టేషన్లలో ఉన్న 36 ఖాళీ స్థలాలను 15 సంవత్సరాల కాలపరిమితికి లీజుకు ఇవ్వడానికి టెండర్లు ఆహ్వానించిన నేపథ్యంలో ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు ఈ నెల 19వ తేదీన అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు ఏలూరు జిల్లా ప్రజా రవాణా అధికారి ఎన్‌వీఆర్ వర ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఏలూరు జిల్లా ద్వారకా తిరుమలలో ఒకటి, కొయ్యలగూడెంలో ఒక బిట్, కలిదిండిలో 2 బిట్లు, కైకలూరులో 2 బిట్లు, పశ్చిమ గోదావరి జిల్లాలో భీమవరం ఆర్టీసీ స్టాఫ్ క్వార్టర్స్ స్థలం, ఆకివీడులో ఒక బిట్, మార్టేరులో ఒక బిట్‌కు టెండర్లను ఆహ్వానించినట్లు తెలిపారు. ఈ టెండర్ల ప్రక్రియలో టెండర్లు ఎలా దాఖలు చేయాలో, స్థలాలను ఎలా లీజుకు దక్కించుకోవాలో, లీజుకు పొందే స్థలాలలో ఏవిధంగా వ్యాపారాలు చేసుకోవాలో అవగాహన సదస్సులో వివరిస్తారని తెలిపారు. గురువారం మధ్యాహ్నం 3 గంటలకు ప్రజా రవాణా అధికారి కార్యాలయంలో అవగాహన సదస్సు జరుగుతుందని తెలిపారు.

క్లుప్తంగా

28, 29 తేదీల్లో ర్యాపిడ్ రేటింగ్ చెస్ టోర్నీ

సాక్షి, భీమవరం: జిల్లా చెస్ అసోసియేషన్, యూత్ కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో భీమవరంలో ఈనెల 28, 29 తేదీల్లో ఇంటర్నేషనల్ ర్యాపిడ్ రేటింగ్ ఫైడ్ చెస్ టోర్నమెంట్ నిర్వహించనున్నట్లు చెస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు మాదాసు కిషోర్ చెప్పారు. టోర్నమెంట్‌కు సంబంధించిన వివరాలను మంగళవారం విలేకర్లకు వెల్లడించారు. రూ.5 లక్షల ప్రైజ్‌మనీతో నిర్వహించే ఈ పోటీలకు ఇప్పటికే వివిధ రాష్ట్రాలకు చెందిన 110 మంది క్రీడాకారులు పేర్లు నమోదు చేసుకున్నారన్నారు. ఇతర వివరాల కోసం 90632 24466 నంబర్‌కు ఫోన్ చేసి సంప్రదించాలని కిషోర్ తెలిపారు.

చికిత్స పొందుతూ రిటైర్డ్ హెచ్‌ఎం మృతి


కాటిక మోషేన్ (ఫైల్)

భీమడోలు: ఇంట్లోకి బైక్ ఎక్కిస్తుండగా జారి పడటంతో తీవ్ర గాయాలపాలై ఆస్పత్రిలో చికిత్స పొందుతూ రిటైర్డ్ హెచ్‌ఎం మంగళవారం మృతి చెందారు. వివరాలిలా ఉన్నాయి. పొలసానిపల్లిలో నివాసం ఉంటున్న రిటైర్డ్ హెచ్‌ఎం కాటిక మోషేన్ (63) ఇరవై రోజుల క్రితం ఇంట్లో బైక్‌ను ఎక్కిస్తుండగా ఇంజిన్ ఆగి ప్రమాదవశాత్తు జారి పడటంతో తలకు తీవ్ర గాయమై అపస్మారక స్థితిలోకి వెళ్లారు. వెంటనే ఆయనను విజయవాడలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స నిమిత్తం చేర్పించారు. పరిస్థితి విషమించడంతో విజయవాడలోని ప్రభుత్వ ఆసుపత్రికి సోమవారం తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందారు. భీమడోలు హెచ్‌సీ సూరిశెట్టి శ్రీనివాసరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బాల్ బ్యాడ్మింటన్ రాష్ట్ర పోటీలకు గోయెంకా విద్యార్థి


అశోక్‌ను అభినందిస్తున్న దృశ్యం

పెంటపాడు: రాష్ట్ర స్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు తమ కళాశాల విద్యార్థి ఎంపికైనట్లు పెంటపాడు డీఆర్ గోయెంకా ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వరరావు మంగళవారం చెప్పారు. తమ కళాశాలలో బీకాం ద్వితీయ సంవత్సరం చదువుతున్న జె.అశోక్ చదువుతో పాటు, క్రీడలలో రాణిస్తున్నాడన్నారు. ఈ నెల 15న చాగల్లులో రాష్ట్ర స్థాయి బాల్ బ్యాడ్మింటన్ ఎంపిక పోటీలు నిర్వహించగా, వాటిలో పాల్గొని ప్రతిభ కనపరిచి ఎంపికయ్యాడన్నారు. విద్యార్థిని మంగళవారం కళాశాలలో జరిగిన ఒక కార్యక్రమంలో ప్రత్యేకంగా అభినందించారు. వైస్ ప్రిన్సిపాల్ బ్రహ్మాచారి, కామర్స్ విభాగాధిపతి ప్రసాద్, ఎకనామిక్స్ విభాగాధిపతి విజయబాబు, పీడీ అజ్జీబాబు పాల్గొన్నారు.

పండుగల వేళ.. పసిడి పరుగులు

- 24 క్యారెట్లు 10 గ్రాములు రూ.61 వేలకు చేరిన ధర
- కేజీ రూ.72 వేలు పలుకుతున్న వెండి
- భారీగా తగ్గిన కొనుగోళ్లు.. ఇజ్రాయెల్ యుద్ధ ప్రభావం


నరసాపురంలో ఓ జ్యూయలరీ షాపు


బంగారు ఆభరణాలు

నరసాపురం: ఇజ్రాయెల్ యుద్ధం ప్రభావంతో బంగారం ధరలు ఆకాశానికి చేరి కూర్చున్నాయి. రెండు నెలల క్రితం బంగారం ధరలు కాస్త తగ్గినా, మళ్లీ జోరు మీదున్నాయి. ఓవైపు షేర్ మార్కెట్ ఒడిదుడుకుల్లో కొనసాగుతోంది. అంతర్జాతీయంగా క్రూడ్ ఆయిల్ ధరలు పెరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో బంగారం ధరలు ఇప్పట్లో తగ్గే అవకాశం కనిపించడం లేదు. ప్రస్తుతం బంగారం ధరలు ఆల్‌టైం హైలో కొనసాగుతున్నాయి. 10 గ్రాముల 24 క్యారెట్ల బంగారం రూ.61 వేలు మార్కును చేరుకుంది. ఇదే జోరు కొనసాగితే రూ.70 వేలను కూడా దాటేస్తుందని అంచనా వేస్తున్నారు. నిలకడగా ఉన్న బంగారం ధరలు ఇంకా తగ్గుతాయని కొన్ని నెలలుగా బులియన్ వర్గాలు విశ్లేషిస్తూ వస్తున్నాయి. అయితే వారి అంచనాలను తలకిందులు చేస్తూ ఇప్పుడు బంగారం ధరలు కొండెక్కి కూర్చున్నాయి. మరోవైపు వెండి ధర కూడా పెరుగుతోంది. ప్రస్తుతం వెండి కిలో రూ.72 వేల వద్ద ట్రేడవుతోంది. ముంబై మార్కెట్ ధర ఆధారంగా నరసాపురం బులియన్ వ్యాపారం జరుగుతుంది. మంగళవారం నరసాపురం మార్కెట్‌లో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.61 వేలు, 22 క్యారెట్ల ఆభరణాల బంగారం ధర 10 గ్రాములు రూ.56,500లుగా ఉంది. 916 కేడీఎం ఆభరణాల బంగారం కాసు ధర ప్రస్తుతం రూ.45,200లకు చేరింది.

దుకాణాలు వెలవెల

దసరా, దీపావళి పండుగల రోజుల్లో బంగారం అమ్మకాలు జోరుగా సాగుతాయి. ఇక క్రిస్మస్, సంక్రాంతి పండుగలు కూడా సమీపంలో ఉండటం, మరోవైపు పెళ్లిళ్ల సీజన్ కూడా మొదలవడంతో బంగారం ధరల పెరుగుదల అమ్మకాలపై ప్రభావం చూపింది. దీంతో మొన్నటివరకు కళకళలాడిన జ్యూయలరీ షాపులు ప్రస్తుత సీజన్‌లో కూడా వెలవెలబోతున్నాయి. ఒక్క నరసాపురం మార్కెట్ లోనే హోల్‌సేల్, రిటైల్ కలిపి రోజుకు రూ.3 కోట్ల వరకు బంగారం అమ్మకాలు జరుగుతాయి. ఉమ్మడి పశ్చిమలోని ఏలూరు, తణుకు, తాడేపల్లిగూడెం, భీమవరం పట్టణాల్లో పెద్ద ఎత్తున అమ్మకాలు జరుగుతాయి. పెరిగిన ధరలతో జిల్లాలో రోజుకు రూ.2 కోట్ల వరకూ అమ్మకాలు తగ్గినట్టుగా అంచనా. దాదాపు 30 శాతం అమ్మకాలు తగ్గిపోయాయయని బులియన్ వర్తకులు చెబుతున్నారు.

పాత బంగారం మార్పిడిపై ఆసక్తి

బంగారం ధర భారీగా పెరగడంతో ఆభరణాల అమ్మకాలు పడిపోయాయి. పెళ్లిళ్ల వంటి సామాజిక అవసరాలకు బంగారం కొనేవారు కూడా వాయిదాలు వేసుకుంటున్నారు. పెట్టుబడిగా కొనే బిస్కెట్ అమ్మకాలు మాత్రం కాస్త బాగానే సాగుతున్నాయని చెబుతున్నారు. ఇక పాత బంగారం మార్పిడి జోష్ అన్ని పట్టణాల్లో కొనసాగుతోంది. ధర రూ.61 వేలకు చేరడంతో పాతబంగారం మార్పిడికి ఇదే అదునుగా కొనుగోలుదారులు భావిస్తున్నారు. ప్రస్తుతం జరుగుతున్న అమ్మకాల్లో 50 శాతం వాటా పాత బంగారం మార్పిడితోనే జరుగుతోంది.

ధర ఇంకా పెరగొచ్చు



బంగారం ధరలు ఇంకా పెరిగే అవకాశం ఉంది. ఒకవేళ తగ్గినా పెద్దగా తగ్గకపోవచ్చు. ఇజ్రాయెల్ యుద్ధం ప్రభావం ఎక్కువగా ఉంది. ఏదిఏమైనా బంగారం ధరలను అంచనా వేయలేకపోతున్నాం. ప్రస్తుతం 30 శాతం అమ్మకాలు తగ్గాయి. నగదుతో ఎవరూ బంగారం కొనుగోళ్లు చేయడం లేదు. పాత బంగారం మార్చుకుని కొత్త వస్తువులు ఆర్డర్లు ఇస్తున్నారు. ప్రస్తుతం ఇదే వ్యాపారం ఎక్కువగా సాగుతోంది.

– వినోద్‌కుమార్ జైన్, అధ్యక్షుడు, నరసాపురం బులియన్ మర్చంట్స్ అసోసియేషన్

వైఎస్సార్ సీపీలోకి టీడీపీ నేత శౌంరి చేరిక


శౌంరికి గజమాల వేసి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే డీఎన్నార్, ఎమ్మెల్సీ జయమంగళ

కైకలూరు: రాష్ట్ర పురోభివృద్ధికి అహర్నిశలు కృషి చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పనితీరు నచ్చి ఇతర పార్టీల నేతలు వైఎస్సార్ సీపీలో చేరుతున్నారు. కైకలూరు సీఎన్నార్ గార్డెన్‌లో మండవల్లి మండలం కానుకొల్లు గ్రామానికి చెందిన టీడీపీ నేత, గౌడ సంఘ నాయకుడు శౌంరి కుమారస్వామి మంగళవారం ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్), ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ సమక్షంలో పార్టీలో చేరారు. ఆయనతో పాటు మరో 10 మంది అనుచరులకు పార్టీ కండువాలు కప్పి ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు ఆహ్వానించారు. శౌంరి కుమారస్వామి మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ విజయానికి కృషి చేస్తానని చెప్పారు. కానుకొల్లు సర్పంచ్ నాగదాసి థామస్, నాయకులు పుట్టి సత్యనారాయణ, జెడ్పీటీసీ సభ్యులు ముంగర విజయనిర్మల, ఎమ్మెల్యే డీఎన్నార్ కుమారులు దూలం వినయ్, శ్యామ్, వైఎస్సార్ సీపీ మండలాధ్యక్షుడు గుమ్మడి వెంకటేశ్వరరావు, వైఎస్సార్ సీపీ ఏలూరు జిల్లా సేవాదళ్ అధ్యక్షుడు బలే నాగరాజు, నాయకులు సయ్యపురాజు గుర్రాజు, చేబోయిన వీర్రాజు, బేతపూడి ఏసోబురాజు, మండవల్లి మండల సర్పంచ్లు, ఎంపీటీసీలు, పీఏసీఎస్ అధ్యక్షులు, సచివాలయ కన్వీనర్లు పాల్గొన్నారు.

2 టన్నుల రేషన్ బియ్యం పట్టివేత


పట్టుబడిన వాహనంతో విజిలెన్స్ అధికారులు

పెదవేగి: వ్యాన్‌లో అక్రమంగా తరలిస్తున్న రెండు టన్నుల రేషన్ బియ్యాన్ని మంగళవారం రాత్రి విజిలెన్స్ అధికారులు పట్టివేశారు. విజిలెన్స్ ఎస్పీ కరణం కుమార్‌కు అందిన సమాచారంతో ఆయన ఆదేశాల మేరకు పెదవేగి పీహెచ్‌సీ సమీపంలో విజిలెన్స్, పౌరసరఫరాల అధికారుల తనిఖీలు నిర్వహించారు. కూచింపూడి నుంచి అక్రమంగా వ్యాన్‌లో తరలిస్తున్న రెండు టన్నుల రేషన్ బియ్యాన్ని తరలిస్తున్నట్లు గుర్తించి బియ్యం, వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. సరుకు యజమాని కూచింపూడికి చెందిన ఉప్పల ప్రకాష్, డ్రైవర్ గిత్త శివలపై కేసు నమోదు చేశారు. తనిఖీల్లో విజిలెన్స్ సీఐ యూజే విల్సన్, సివిల్ సప్లయిస్ డీటీ ఎ.ప్రమోద్‌కుమార్ పాల్గొన్నారు.

టీటీలో అచ్యుత్‌కు కాంస్యం

ఏలూరు రూరల్: రాష్ట్ర స్థాయి టేబుల్ టెన్నిస్ పోటీల్లో ఏలూరుకు చెందిన ఎస్.అచ్యుత్ కాంస్య పతకం సాధించాడని శాప్ కోచ్ ఘంటా శేఖర్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 13 నుంచి 16వ తేదీ వరకు అనంతపురంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి టేబుల్ టెన్నిస్ పోటీల్లో అండర్-11 విభాగంలో అచ్యుత్ ప్రతిభ చూపి పతకం సాధించాడన్నారు. ఈ సందర్భంగా అచ్యుత్‌ను జిల్లా చీఫ్ కోచ్ బి.శ్రీనివాసరావు, సెట్‌వెల్ సీఈఓ ఎండీహెచ్ మెహర్రాజ్ అభినందించారు.

ఉప్పొంగిన అభిమానం.. వినూత్న ప్రచారం


నాగన్నగూడెంలో వైఎస్సార్‌సీపీ జెండా దుస్తులతో సైకిల్‌పై ప్రచారానికి వెళుతున్న సోమయ్య

పెదవేగి: నాగన్నగూడెం గ్రామానికి చెందిన సొంగ సోమయ్య అనే వ్యక్తి వైఎస్సార్ సీపీకి వీరాభిమాని. మహానేత వైఎస్సార్‌పై అభిమానంతో ఉండేవాడు. అనంతరం ఆయన తనయుడు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిపై కూడా అదే మక్కువను ప్రదర్శిస్తున్నాడు. 2019 ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ జెండా రంగుల్లో దుస్తులను కుట్టించుకుని వాటిని ధరించి ప్రచారం చేయగా, అప్పట్లో వార్తల్లో నిలిచిన విషయం విదితమే. అలాగే ప్రస్తుతం సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న వేళ మళ్లీ వైఎస్సార్‌సీపీ జెండా దుస్తులను ధరించి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన తరువాత చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తూ ఎండను సైతం లెక్కచేయకుండా సైకిల్‌పై ప్రచారం చేస్తున్నాడు. నియోజకవర్గంలోని నాలుగు మండలాలు తిరుగుతూ సీఎం వైఎస్ జగన్ చేస్తున్న అభివృద్ధిని చాటిచెబుతానని సోమయ్య అంటున్నాడు. 2024లో కూడా విజయం సాధించి పేదలకు మరింత అండగా వైఎస్ జగన్ నిలుస్తారని సోమయ్య ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

వృద్ధులకు ఉచిత న్యాయ సహాయం


సదస్సులో మాట్లాడుతున్న మేరీ గ్రేస్ కుమారి

ఏలూరు (టూటౌన్): వృద్ధులకు న్యాయసేవాధికార సంస్థలు ఉచిత న్యాయ సహాయం అందిస్తాయని పర్మినెంట్ లోక్ అదాలత్ చైర్‌పర్సన్ ఎ.మేరీ గ్రేస్ కుమారి అన్నారు. స్థానిక కోటదిబ్బలోని రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం భవనంలో మంగళవారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. శాశ్వత న్యాయ పీఠం అందించే సేవలు, లీగల్ సర్వీసెస్ అందించే ఉచిత సేవలపైనా అవగాహన కల్పించారు. రవాణా, పోస్టల్, ఇన్సూరెన్స్, బ్యాంకింగ్, విద్య, వైద్య, జాతీయ ఉపాధి హామీ పథకం, రియల్ ఎస్టేట్ మొదలైన సేవల్లో లోపం జరిగిన కేసులను శాశ్వత లోక్‌అదాలత్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని చెప్పారు. దీనికి ఎటువంటి రుసుమూ వసూలు చేయరని తెలిపారు. కక్షిదారులకు కౌన్సెలింగ్ నిర్వహించి రాజీచేయడం లేదా సాక్షులను విచారించి తీర్పు ఇవ్వడం చేస్తారని, ఈ తీర్పులకు అప్పీల్ ఉండదన్నారు. పర్మినెంట్ లోక్‌అదాలత్ సభ్యులు రామమోహనరావు, రిటైర్డ్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు పి.ఆంజనేయులు, కార్యదర్శి కె.మహాలక్ష్మి పాల్గొన్నారు.

గడపగడపకు సంక్షేమం


వీరవాసరం: మడుగు పోలవరంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఓ మహిళకు సంక్షేమ పథకాల వల్ల కలిగిన లబ్ధిని వివరిస్తున్న ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్


ఉండి: మహదేవపట్నంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఓ మహిళకు సంక్షేమ పథకాల బ్రోచర్‌ను అందిస్తున్న డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు

అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వ పాలన

ఏపీ ప్రెస్ అకాడమీ చైర్మన్ కొమ్మినేని


శ్రీవారి ఆలయంలో కొమ్మినేనికి స్వామివారి మెమెంటో అందజేస్తున్న ఏఈఓ దుర్గారావు

ద్వారకాతిరుమల: అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం పరిపాలన సాగిస్తోందని ఏపీ ప్రెస్ అకాడమీ చైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు అన్నారు. శ్రీవారి దర్శనానంతరం కొండపైన అతిథి గృహంలో మంగళవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. దేశంలోని ఏ రాష్ట్రంలోను లేని విధంగా రాష్ట్ర ప్రభుత్వం పేద ప్రజలకు అనేక సంక్షేమ ఫలాలను అందిస్తోందన్నారు. అనంతపురం నుంచి శ్రీకాకుళం వరకు తాను పర్యటిస్తున్నానని, ప్రతి జిల్లాలో ఏదో ఒక అభివృద్ధి కార్యక్రమం జరుగుతోందన్నారు. మచిలీపట్నం నుంచి కాకినాడ వరకు సముద్రతీర ప్రాంతాల అభివృద్ధిపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రత్యేక దృష్టి సారించారని అన్నారు. రాష్ట్రంలో ఓడరేవుల అభివృద్ధికి ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని, అందులో భాగంగా రామాయపటప్నం ఓడరేవు అభివృద్ధి పనులు శరవేగంగా జరుగుతున్నాయన్నారు. అదేవిధంగా సుమారు 9 ఫిషింగ్ హార్బర్లు నిర్మాణంలో ఉన్నట్టు చెప్పారు. రాష్ట్రంలో పేదలకు అనేక వైద్య సేవలను అందించడమే కాకుండా ఇటీవల ఐదు ప్రభుత్వ మెడికల్ కళాశాలలను ప్రారంభించడం జరిగిందన్నారు. త్వరలో మరో ఐదు మెడికల్ కళాశాలలు ప్రారంభానికి సిద్ధంగా ఉన్నాయన్నారు. విశాఖపట్టణాన్ని ఐటీ హబ్‌గా అభివృద్ధి చేసేందుకు సీఎం కృషి చేస్తున్నారన్నారు. రూ.3 కోట్లతో ఐటీ కాంప్లెక్స్ ఏర్పాటు, అలాగే అనేక రకాల పరిశ్రమలను నెలకొల్పడం ప్రభుత్వ ధ్యేయమన్నారు. రామయ్యపేటలో రూ.40 వేల కోట్లతో సోలార్ ప్రాజెక్ట్ నిర్మించడం వల్ల నెల్లూరు నుంచి గుంటూరు వరకు ప్రయోజనం చేకూరుతుందన్నారు. ఆంధ్రప్రదేశ్ అన్ని రంగాల్లోనూ వేగం పుంజుకుని పరుగులు తీస్తోందన్నారు. పేదలకు అందిస్తున్న సంక్షేమ ఫలాలు శాశ్వతంగా అందాలంటే వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని ప్రజలంతా ఆశీర్వదించాలన్నారు.

తొలుత చినవెంకన్న ఆలయాన్ని ఏపీ ప్రెస్ అకాడమీ చైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు సతీసమేతంగా సందర్శించారు. ఆలయానికి విచ్చేసిన ఆయనకు దేవస్థానం అధికారులు, అర్చకులు ఆలయ మర్యాదలతో ఆహ్వానం పలికారు. ఆలయ ముఖ మండపంలో అర్చకులు, పండితులు ఆయనకు శ్రీవారి శేషవస్త్రాన్ని కప్పి, వేద ఆశీర్వచనాన్ని పలుకగా, దేవస్థానం ఏఈఓ మెట్టపల్లి దుర్గారావు స్వామివారి మెమెంటో, ప్రసాదాలను అందజేశారు. ఓఎస్డీ ఎస్.శ్రీనివాస్ జీవన్ తదితరులున్నారు.

చికిత్స పొందుతూ తాపీ కూలీ మృతి

ఉండి: పురుగుమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఓ తాపీ కూలీ చికిత్స పొందుతూ మృతి చెందాడు. వివరాలిలా ఉన్నాయి. మహదేవపట్నంకు చెందిన కడిమి వెంకటేష్ (38) తాపీ పనులకు వెళుతుండగా, ఇతని భార్య భీమవరంలోని ఓ స్వీట్ షాపులో పనిచేస్తోంది. వీరికి కుమార్తె, కుమారుడు ఉన్నారు. ఏమైందో ఏమో తెలియదు గానీ కొద్దిరోజులుగా వెంకటేష్ ముభావంగా ఉంటూ ఎవరితో మాట్లాడలేదు. ఈ క్రమంలో ఈ నెల 12న తాపీ పనికి వెళ్లగా, భార్య స్వీట్ షాపునకు వెళ్లింది. అయితే 11 గంటలకు వెంకటేష్ పురుగుమందు తాగి ఇంటికి వచ్చి వాంతులు చేసుకుంటున్నాడు. కుమారుడు తల్లికి ఫోన్ చేసి విషయం చెప్పగా, వెంటనే ఆమె స్థానిక ఆర్‌ఎంపీ వద్దకు, అక్కడ నుంచి భీమవరం ప్రభుత్వ ఆసుపత్రికి, మెరుగైన వైద్యం కోసం ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తీసుకువెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం వెంకటేష్ మృతి చెందాడు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై ఎ.సూర్యనారాయణ చెప్పారు.

వ్యాపారం పేరుతో సొమ్ము కాజేత

భీమవరం అర్బన్: వ్యాపారం చేద్దామని చెప్పి సొమ్ము కాజేసిన వ్యక్తులపై పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలిలా ఉన్నాయి. ఎల్‌వీఎన్ పురం గ్రామానికి చెందిన కొల్లాటి శ్రీను వద్ద నుంచి యనమదుర్రు గ్రామానికి గంధం గణేష్, అతని ఇద్దరు సోదరులు రూ.2.50 లక్షల నగదు, 4.5 కాసుల బంగారం, మహీంద్ర పికప్ వాహనాన్ని వ్యాపారం చేద్దామని నమ్మించి తీసుకుని తిరిగి ఇవ్వలేదు. దీంతో బాధితుడు కొల్లాటి శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు హెడ్ కానిస్టేబుల్ పి.మహేశ్వరరావు మంగళవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

హ్యాండ్‌బాల్‌లో సత్తా చాటిన పశ్చిమ జట్లు


సాధించిన కప్‌ను కలెక్టర్ ప్రసన్న వెంకటేష్‌కు చూపుతున్న క్రీడాకారిణులు


బాలుర జట్టును అభినందిస్తున్న కలెక్టర్ ప్రసన్న వెంకటేష్

ఏలూరు రూరల్/ ఏలూరు (మెట్రో): కడపలోని డీఎస్‌ఏ స్టేడియంలో ఈ నెల 14, 15, 16 తేదీల్లో జరిగిన హ్యాండ్‌బాల్ రాష్ట్ర పోటీల్లో ఉమ్మడి పశ్చిమగోదావరి సీనియర్ మహిళల జట్టు, బాలుర జట్లు సత్తా చాటి చాంపియన్‌షిప్‌ను కైవసం చేసుకున్నాయి. అంతేకాక ఈ జట్లలో క్రీడాకారులను రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేశారు. ఈ సందర్భంగా ఏలూరులో తనను కలిసిన ఇరు జట్ల క్రీడాకారులను మంగళవారం కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ అభినందించారు. వివరాల్లోకి వెళితే.. కడపలో సోమవారం సాయంత్రం జరిగిన మహిళల ఫైనల్స్‌లో ఉమ్మడి పశ్చిమ జట్టు కృష్ణా జట్టుపై 15–7 గోల్స్‌తో విజయం సాధించి విజేతగా నిలిచింది. అలాగే బాలుర జట్టు ఫైనల్‌లో చిత్తూరు జట్టుపై 21–15 స్కోర్‌తో గెలిచి ట్రోఫీ అందుకుంది. కర్నూల్ మహిళల జట్టు, విజయనగరం బాలుర జట్టు మూడో స్థానంలో నిలిచాయి. పోటీల్లో ప్రతిభ చాటిన జిల్లా క్రీడాకారులను సెలెక్షన్ కమిటీ సభ్యులు రాష్ట్ర జట్టుకు ఎంపిక చేశారని జిల్లా అసోసియేషన్ అధ్యక్షులు వై.లక్ష్మీనారాయణ, కార్యదర్శి కె.అలివేలు వెల్లడించారు. బాలుర విభాగంలో కె.ప్రభుదేవ, డి.ప్రశాంత్, ఎ.శ్రీరామ్‌యాదవ్, ఎ.సుభాని, మహిళల విభాగంలో డి.రాఖీ, డి.స్వాతి, పుణ్య, ఉమామహేశ్వరి, దుర్గారాణి, జెస్సీ ఉన్నారు. నవంబర్‌లో జరిగే జాతీయ పోటీల్లో వీరు పాల్గొంటారని చెప్పారు.

మహీంద్రా షోరూమ్ ప్రారంభం


ట్రాక్టర్ కీని అందజేస్తున్న యాజమాన్యం

తాడేపల్లిగూడెం (టీఓసీ): ఏలూరులో మహీంద్రా ట్రాక్టర్స్ డీలర్‌గా సేవలందిస్తున్న నేరెళ్ల రాజా ఆటోమొబైల్స్ మంగళవారం తాడేపల్లిగూడెం తమ నూతన షోరూమ్‌ను ప్రారంభించింది. మెగా డెలివరీ మేళా నిర్వహించి రైతులకు ట్రాక్టర్లు అందజేసింది. లక్కీడిప్‌లో గెలుపొందిన విజేతలకు బైక్ తదితర బహుమతులను నిర్వాహకులు అందజేశారు. ఈ కార్యక్రమంలో డీలర్ నేరెళ్ల రవి అండ్ సన్స్, మేనేజర్లు రతన్‌చంద్, రామకృష్ణ, బాలచంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఉత్సవ ఏర్పాట్లు బాగున్నాయి

● మంత్రి కారుమూరి



మంత్రి కారుమూరికి దుర్గమ్మ చిత్రపటం అందజేస్తున్న ఆలయ చైర్మన్ రాంబాబు, ఈఓ రామారావు

ఇంద్రకీలాద్రి(విజయవాడ పశ్చిమ): ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి, ప్రజలందరికీ మంచి జరగాలని అమ్మవారికి వేడుకున్నానని పౌర సరఫరాల శాఖ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు పేర్కొన్నారు. ఇంద్రకీలాద్రిపై జరుగుతున్న దసరా ఉత్సవాల్లో మూడో రోజైన మంగళవారం అన్నపూర్ణాదేవిగా దుర్గమ్మ దర్శనమిచ్చింది. అర్చకులు మంత్రి కారుమూరికి పూర్ణకుంభంతో స్వాగతం పలకగా అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపించారు. అనంతరం మంత్రి కారుమూరి విలేకర్లతో మాట్లాడుతూ దసరా ఉత్సవాల ఏర్పాట్లు చాలా బాగున్నాయంటూ భక్తులు సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని, దేశంలోని ప్రతి ఒక్కరూ సంతోషంగా ఉండాలన్నారు. భక్తులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు చేసిన దేవస్థానం అధికారులు, పాలక మండలికి అభినందనలు తెలిపారు.

నేడు ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని ఎల్.అగ్రహారం గ్రామంలో బుధవారం సాయంత్రం 4 గంటలకు ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ ప్రారంభించనున్నట్టు మంత్రి క్యాంపు కార్యాలయ ప్రతినిధులు తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. అధికారులు, ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులు పాల్గొనాలని కోరారు.

శబరిమలకు పయనమైన అయ్యప్ప భక్తులు



శ్రీఅయ్యప్ప మందిరంలో ఇరుముడులు సందర్భంగా పూజలు నిర్వహిస్తున్న గురుస్వామి

అత్తిలి: బల్లిపాడు శ్రీఅయ్యప్ప దీక్షా మందిరంలో మాలధారణ చేసిన అయ్యప్ప భక్తులు మంగళవారం ఇరుముడులు ధరించి శబరిమల యాత్రకు పయనమయ్యారు. పేరాబత్తుల రామకృష్ణ గురుస్వామి 36వ ఏటా అయ్యప్ప మాలధారణ చేసి, శబరిమల యాత్రకు వెళుతున్న సందర్భంగా స్వామివారికి పంచామృతాలతో అభిషేకం, విశేష పూజలు జరిపారు. అయ్యప్పమాలధారణ చేసిన భక్తులకు గురుస్వామి ఆధ్వర్యంలో ఇరుముడులు కట్టారు. పెద్ద సంఖ్యలో భక్తులు ఈకార్యక్రమంలో పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ చేపల ప్యాకింగ్ కార్మికుడి మృతి

ఆకివీడు: స్థానిక అమృతరావు కాలనీకి చెందిన చేపల ప్యాకింగ్ కార్మికుడు ఉప్పాటి కుమార్(36) రోడ్డు ప్రమాదంలో గాయాలపాలై ఏలూరు ప్రభు త్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం ఉదయం మృతి చెందినట్లు ఎస్సై నాగబాబు చెప్పా రు. ఈనెల 16వ తేది సాయంత్రం స్థానిక వెంకయ్య వయ్యేరు వంతెన సమీపంలో నడుచుకుంటూ వస్తున్న కుమార్‌ను వెనుక నుంచి ఆటో ఢీకొట్టినట్లు తెలిపారు. గాయపడిన అతనికి స్థానిక ఆసుపత్రిలో చిక్సిత్స చేయించి, మెరుగైన వైద్యం కోసం ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు.

మోటార్ సైక్లిస్ట్‌పై దాడి

ఆకివీడు: మండలంలోని దుంపగడప గ్రామానికి చెందిన మేరుగుమిల్లి దుర్గాప్రసాద్ సోమవారం రాత్రి మోటార్ సైకిల్‌పై వెళ్తుండగా ఇద్దరు వ్యక్తులు అడ్డరోడ్డులో ఖాళీ సీసాతో అతని తలపై కొట్టగా గాయపడినట్లు ఎస్సై నాగబాబు మంగళవారం తెలిపారు. అకారణంగా గొడవ పడి ఆకివీడు రైల్వే గేటు ప్రాంతానికి చెందిన వలుపు మురళి, పాల విక్రమ్‌లు సీసాతో కొట్టినట్లు ప్రసాద్ ఇచ్చిన ఫిర్యా దు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పోలీసులకు సహకరించాలి

సాక్షి, భీమవరం: శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసులకు ప్రజలు సహకరించాలని జిల్లా అదనపు ఎస్పీ ఏవీ సుబ్బరాజు అన్నారు. భీమవరం ఎస్ఆర్‌కేఆర్ ఇంజినీరింగ్ కళాశాల ఆధ్వర్యాన మంగళవారం పోలీసులు, క్రీడాకారులకు కళాశా ల సెక్రటరీ, కరస్పాండెంట్ సాగి రామకృష్ణ నిశా ంత్ వర్మ చేతుల మీదుగా హెల్మెట్లు పంపిణీ చేసిన సందర్భంగా ఆయన మాట్లాడారు. కళాశాల అన్నివర్గాలను ప్రోత్సహిస్తూ క్రీడలు, సాంస్కృతిక సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. కళాశాల డైరెక్టర్ ఎం. జగపతిరాజు, ప్రిన్సిపాల్ కేవీ మురళీకృష్ణంరాజు, కళాశాల ఉపాధ్యక్షుడు సాగి విఠల్ రంగరాజు, భీమవరం డీఎస్పీ బండారు శ్రీనాథ్, టూ టౌన్ సీఐ జి.శ్రీనివాస్ పాల్గొన్నారు.

● అన్నపూర్ణా నమోస్తుతే...



తణుకు అర్బన్: కాశీ అన్నపూర్ణాదేవి అవతారంలో శ్రీకామాక్షి దేవి



తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణ ఇలవేల్పు బలుసులమ్మమ్మవారు



అత్తిలి: శ్రీ విజయచాముండేశ్వరిదేవి అమ్మవారు



తాడేపల్లిగూడెం రూరల్: ముత్యాలంబాపురం శ్రీముత్యాలమ్మ



తాడేపల్లిగూడెం (టీఓసీ): శంకరమఠంలో అన్నపూర్ణాదేవిగా సర్వమంగళమ్మ



పెంటపాడు: అన్నపూర్ణాదేవి అలంకరణలో దుర్గమ్మ



తణుకు టౌన్: ప్రత్యేక అలంకరణలో మండపాక యల్లారమ్మ

పూజలందుకుంటున్న దుర్గమ్మ

దుర్గాదేవి శరన్నవరాత్రుల మహోత్సవాల మూడోరోజు అమ్మవారు అన్నపూర్ణాదేవి భక్తులకు దర్శనమిచ్చారు. వాడవాడలా అమ్మవారి విగ్రహాలను ప్రతిష్ఠించి, ప్రత్యేక పూజలు చేశారు. కమిటీ సభ్యులు, యువత మాలదారణ చేసి విగ్రహాలను పురవీధుల్లో ఊరేగించారు. జై.దుర్గ, జైజై దుర్గ అంటూ భక్తులు నినదించగా..గ్రామాల్లో ఆధ్యాత్మిక సందడి నెలకొంది. ఈనెల 24తో ఉత్సవాలు ముగియనున్నాయి.

– తణుకు అర్బన్, తణుకు టౌన్, అత్తిలి, తాడేపల్లిగూడెం రూరల్, తాడేపల్లిగూడెం (టీఓసీ), పెంటపాడు

సామాన్యులపై మోయలేని భారం



మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి భీమారావు

తాడేపల్లిగూడెం (టీఓసీ): ప్రజా వ్యతిరేక విధానాలను కేంద్ర ప్రభుత్వం మానుకోవాలని వామపక్ష నేతలు డిమాండ్ చేశారు. మంగళవారం కపర్థి భవనంలో సీపీఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమరావు మాట్లాడుతూ పెంచిన విద్యుత్ చార్జీలను తగ్గించాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం వివిధ రకాల సేవలపై చార్జీలు, పన్నులు పెంచి సామాన్య ప్రజలపై పెను భారాన్ని మోపుతున్నాయన్నారు. మోదీ ప్రభుత్వం అధిక ధరలను నియంత్రించే విషయంలో పూర్తిగా విఫలమైందన్నారు. పెట్టుబడిదారుల సంక్షేమమే ధ్యేయంగా మోదీ పనిచేస్తున్నారని విమర్శించారు. సీపీఐ శ్రేణులు ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ విస్తృత ప్రచారం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల సమితి సభ్యురాలు యు.నాగలక్ష్మి, పట్టణ కార్యదర్శి మండల నాగేశ్వరరావు, మండల కార్యదర్శి ఉల్లింకల జయకృష్ణ పాల్గొన్నారు.

పుస్తక పఠనంతో జ్ఞానం

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలో దసరా సెలవులు సందర్భంగా ప్రథమశ్రేణి గ్రంథాలయంలో ఏర్పాటు చేసిన శిక్షణా శిబిరంలో మంగళవారం హాజరైన విద్యార్థినీ విద్యార్థులకు విశ్రాంత ఉద్యోగి బాపయ్య శర్మ, హైదరాబాద్‌కు చెందిన కేవీ సత్యప్రకాశ్‌లు వివిధ సబ్జెక్టులు స్పోకెన్ ఇంగ్లీషు, పుస్తకాలు చదవడం, జనరల్ నాలెడ్జి తదితర విషయాలపై అవగాహన కల్పించారు. ప్రథమ శ్రేణి గ్రంథాలయాధికారి వానపల్లి శ్రీనివాసరావు పర్యవేక్షించారు. విద్యార్థులు తదితరులు ఉన్నారు.

ఆహార పదార్థాల తయారీలో నిబంధనలు పాటించాలి

తణుకు అర్బన్: ఆహార పదార్థాల తయారీ, విక్రయించే విధానం, వడ్డన విషయాల్లో శుభ్రత తప్పనిసరిగా పాటించాలని ఐఐఈఎస్‌టీ (ఇండస్ట్రియల్ ఇంక్యుబేషన్ ఎంట్రిప్రెన్యూర్ ఆఫ్ స్కిల్ ట్రెనింగ్) ఫెడరేషన్ ప్రతినిధులు ప్రియాంక భరద్వాజ్, పీయూష్ శర్మ అన్నారు. తణుకు లయన్స్ క్లబ్‌లో ఈనెల 16, 17 తేదీల్లో నిర్వహించిన శిక్షణ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. ముఖ్యంగా బేకరీల్లో తయరయ్యే ఆహార పదార్థాలు తయారీ విధానంలో ఎన్నో జాగ్రత్తలు పాటించాల్సిన అవసరం ఉందన్నారు. ఎటువంటి రక్షణ లేకుండా వర్కర్స్ చేతులమీదే ప్యాకింగ్ అయ్యే ఆహార పదార్థాల విషయంలో చాలా అప్రమత్తంగా ఉండాలని, చేతులకు గ్లోవ్స్ తప్పనిసరిగా ధరించాలని అన్నారు.అనంతరం కోవిడ్ తదితర కారణాలతో కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ఫాస్టాక్ (ఫుడ్ సేఫ్టీ ట్రైనింగ్ సర్టిఫికెట్) విధివిధానాలపై వివరించారు. ఈ కార్యక్రమంలో వడ్లాని దాసు, శ్రీనివాసరెడ్డి, ధర్మారావు, విజయకుమార్, శ్యామ్, ఆనంద్, అపర్ణ, స్వరూప, యశోద, పశ్చిమ, ఏలూరు జిల్లాల నుంచి వచ్చిన బేకరీ యజమానులు, తదితరులు పాల్గొన్నారు.



తణుకులో కర్రీ పాయింట్ యజమానులతో మాట్లాడుతున్న అధికారులు

ఓటీపీలు చెప్పొద్దు

భీమవరం (ప్రకాశంచౌక్): ప్రభుత్వ పథకాలు మంజూరయ్యాయి మీ ఫోన్‌కు ఓటీపీ వచ్చింది చూసి చెప్పండి అని ఎవరైనా ఫోన్ చేస్తే చెప్పవద్దని, ఇటువంటివి నమ్మవద్దని, అప్రమత్తంగా ఉండాలని జిల్లా గ్రామ, వార్డు సచివాలయాల అధికారి కేసీహెచ్ అప్పారావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అమ్మఒడి తదితర పథకాలు మంజూరయ్యాయని మీ ఫోన్‌కు ఓటీపీ వచ్చింది చెప్పాలంటూ అపరిచితులు ఫోన్లు చేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. ఏ పథకానికైనా ఓటీపీ అవసరమైతే సచివాలయ సిబ్బంది స్వయంగా లబ్ధిదారుల వద్దకే వచ్చి తెలుసుకుంటారని చెప్పారు.

వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు

భీమవరం అర్బన్: భీమవరం రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో మంగళవారం వ్యక్తి అదృశ్యంపై పోలీసులు కేసు నమోదు చేశారు. కొత్తపూసలమర్రు గ్రామానికి చెందిన బర్రె నాగలక్ష్మి తన భర్త ఏసు, అదే గ్రామానికి చెందిన జట్టు మేస్త్రి కొక్కిలిగడ్డ నాగరాజుతో కలసి చెన్నై శివారు ఉపాధి కోసం గత నెల 9న కూలి పనులకు వెళ్లారు. ఈనెల 7న తిరిగి సొంతూరు వస్తుండగా సూళ్లూరు పేట వద్ద నుంచి నాగలక్ష్మి భర్త కనిపించకపోవడంతో ఆమె ఫిర్యాదు మేరకు హెడ్ కానిస్టేబుల్ పి.మహేశ్వరరావు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పైడిపర్రులో మాలధారులకు ఉచిత భిక్ష

తణుకు అర్బన్: దానాలన్నిటిలోను అన్నదానం గొప్పది.. అన్నం పరబ్రహ్మ స్వరూపం.. అన్నదాతా సుఖీభవ అనే పెద్దల మాటలను అక్షరాలా నిజం చేస్తున్నారు పైడిపర్రువాసులు. శ్రీదేవీ నవరాత్రుల మహోత్సవాల్లో భాగంగా అధిక శాతం భక్తులు దుర్గమ్మను కొలుస్తూ భవాని మాలను ధరిస్తుండడం ప్రతి ఏటా జరుగుతోంది. అయితే మాలదారులకు భిక్ష శుచిగా శుభ్రంగా ఏర్పాటు చేయాల్సి ఉన్న నేపథ్యంతో పాటు ఎక్కడ పడితే అక్కడ ఏది పడితే అది ఆహారంగా స్వీకరించకుండా మాలదారులు ఎన్నో నియమాలు పాటిస్తుంటారు. కొన్ని సార్లు దూర ప్రాంతాల నుంచి వచ్చిన వారికి భిక్ష స్వీకరించడం ప్రధాన సమస్యగా ఉంటుంది. ఈ సమస్యను గమనించిన మాజీ కౌన్సిలర్ యిండుగపల్లి బలరామకృష్ణ దాతలను సమకూర్చి మాలదారులకు వరుసగా రెండో ఏడాది ఉచితంగా భిక్ష ఏర్పాటుచేస్తున్నారు.



పైడిపర్రులో భిక్ష స్వీకరిస్తున్న భవానీ మాలధారులు

శ్రీబాల వెంకటేశ్వరస్వామి ఆలయంలో...

పైడిపర్రు శ్రీబాల వెంకటేశ్వరస్వామి ఆలయంలో దేవీ నవరాత్రులు సందర్భంగా రోజుకో దాతను సేకరించి వారి సౌజన్యంతో 500 మంది మాలదారులకు భిక్ష సౌకర్యాన్ని ఏర్పాటు చేస్తున్నారు.

నేడు మోగల్లులో అంగన్‌వాడీ భవనం ప్రారంభం

పాలకోడేరు: మండలంలోని మోగల్లులో కొత్తగా నిర్మించిన అంగన్‌వాడీ కేంద్రం భవనం ప్రారంభానికి సిద్ధమైంది. డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు బుధవారం నూతన భవనాన్ని ప్రారంభించనున్నారు. ఈ భవన నిర్మాణానికి నాబార్డు నిధుల నుంచి రు.12 లక్షలు మంజూరు కాగా, మండల పరిషత్ నిధులు రూ.లక్ష కలిపి మొత్తం రూ.13 లక్షలతో నిర్మించారు. ప్రస్తుతం కమ్యూనిటీ హాల్ భవనంలో అంగన్‌వాడీ కేంద్రాన్ని నిర్వహిస్తున్నారు. ఈ భవనం శిథిలావస్థకు చేరి శ్లాబ్ పెచ్చులు ఊడిపోయి చిన్నారులు, అంగన్‌వాడీ కార్యకర్తలు ఇబ్బందులు పడుతున్నారు. దీంతో స్థానిక వైఎస్సార్ సీపీ నాయకులు డీసీసీబీ చైర్మన్ పీవీఎల్‌కు విన్నవించుకున్నారు. ఎంపీపీ భూపతిరాజు సత్యనారాయణ రాజు (చంటి రాజు), డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు నిధులు మంజూరు చేయించి అంగన్‌వాడీ కేంద్రానికి భవన నిర్మాణం పూర్తి చేశారు.

ప్రకృతి సాగును పరిశీలించిన ప్రాజెక్టు మేనేజర్

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని దండగర్ర గ్రామంలో ప్రకృతి విధానంలో సాగు చేస్తున్న వరి చేలను మంగళవారం ప్రకృతి వ్యవసాయం పశ్చిమ గోదావరి జిల్లా ప్రాజెక్టు మేనేజర్ వై.నూకరాజు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామానికి చెందిన ఊడిమూడి విరాట్ బంగారాజు పదెకరాల్లో ప్రకృతి వ్యవసాయం, ఐదు ఎకరాల్లో కూచిపటాలియా, కాలా బట్టి, రక్తశాలి, సిద్ద సన్నాలు వంటి రకాలు సాగు చేయడం జరిగిందన్నారు. పూర్తిగా ప్రకృతి విధానంలో సాగు చేపట్టారన్నారు. తద్వారా భూమి సారవంతంతో పాటు భావితరాలకు మంచి భవిష్యత్‌ను అందించిన వారమవుతామన్నారు. బయోకల్చర్స్ వినియోగించడం ద్వారా రైతులకు ఖర్చు తగ్గి ఆదాయం పెరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయం జోనల్ కోఆర్డినేటర్ గద్దె రత్నాజీ, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.



ప్రకృతి విధానంలో సాగు చేసిన వరి చేలను పరిశీలిస్తున్న ప్రాజెక్టు మేనేజర్ వై.నూకరాజు

ప్రజారోగ్యానికి సీఎం జగన్ భరోసా



అత్తిలి: జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో వైద్యసేవల వివరాలను అడిగి తెలుసుకుంటున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



పెంటపాడు: అలంపురం జెడ్పీస్కూల్ వద్ద జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎంపీపీ దాసరి హైమావతి

పలు గ్రామాల్లో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలు ప్రారంభం

అత్తిలి: ప్రజల ఆరోగ్యానికి సీఎం జగన్ మోహన్‌రెడ్డి భరోసా కల్పిస్తున్నారని, జగనన్న సురక్ష కార్యక్రమంతో ప్రజల ముంగిటకు మెరుగైన వైద్యం చేరిందని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు పైబోయిన సత్యనారాయణ అన్నారు. అత్తిలి ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల ప్రాంగణంలో జగనన్న ఆరోగ్యసురక్ష కార్యక్రమాన్ని మంగళవారం ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా పైబోయిన మాట్లాడుతూ ప్రతి పేదవానికి నాణ్యమైన వైద్యసేవలు అందించి, వారిని సంపూర్ణ ఆరోగ్యవంతులుగా తీర్చిదిద్దడానికి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని చేపట్టారన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గంటా విజేతనాగరాజు, ఉపసర్పంచ్ మద్దాల శ్రీనివాస్, జడ్పీ కోఆప్షన్ మెంబర్ మహ్మద్ అబీబుద్దీన్, బీసీ సెల్ అధ్యక్షుడు రంభ సూరిబాబు, వైద్యనిపుణులు డాక్టర్ ఎస్ శ్రీకాంత్, డాక్టర్ ఎం మహాలక్ష్మి, డాక్టర్ ఎస్ సంతోష్‌రెడ్డి, డాక్టర్ కె దుర్గాభవాని, డాక్టర్ కె నాగరాజు, డాక్టర్ పి కిరణ్, కంటి వైద్యనిపుణులు కెఎస్‌కే రామిరెడ్డి, సీహెచ్‌ఓ పి మురళి, హెచ్‌వీ అమ్మాజీ, కెఎస్ వెంకటరాజు, ఎంఎల్‌హెచ్‌పీ సుధారాణి, జీఎస్ గనిరాజు తదితరులు పాల్గొన్నారు.

వైద్య శిబిరాలకు విశేష స్పందన

ఇరగవరం: జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలకు విశేష స్పందన లభిస్తుందని మండల ప్రత్యేక అధికారి, జిల్లా డ్వామా పీడీ ఎస్‌టివి రాజేశ్వరరావు తెలిపారు. మండలంలోని అయినపర్రు గ్రామంలో మంగళవారం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రాజేశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రతి ఒక్కరూ సంపూర్ణ ఆరోగ్యంతో ఉండాలన్నదే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని తెలిపారు.ఈ సందర్భంగా రోగులను పరీక్షించి మందులను అందజేశారు. జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సత్తి అఖిల, ఎంపీటీసీ సత్తి లీలా ప్రసన్న ,నాయకులు సత్తి వెంకట్ రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు దుర్గా ప్రసాద్, ఎంపీడీవో ఎ శ్రీనివాస్, సచివాలయ సిబ్బంది, పంచాయతీ అధికారులు, నాయకులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్యసురక్ష.. పేదల సంజీవని

పెంటపాడు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం పేదలకు సంజీవని వంటిదని ఎంపీపీ దాసరి హైమావతి పేర్కొన్నారు. జగనన్న ఆరోగ్యసురక్ష కార్యక్రమం మంగళవారం అలంపురం జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ తాతపూడి ప్రగతి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎంపీపీ మాట్లాడుతూ రాష్ట్ర ప్రజల ఆరోగ్యం కోసం వైద్య సేవలే పరమావధిగా భావించి నేడు పేదలకు ఇంటింటికీ ఉచిత వైద్యసేవలు చేయిస్తున్న జగనన్నను ప్రజలు తప్పక ఆదరించాలన్నారు. పార్టీ మండల అధ్యక్షుడు కైగాల శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రతి గ్రామంలో జగనన్న ఆరోగ్యసురక్ష శిబిరాల ద్వారా ప్రజలకు మెరుగైన వైద్యం అందుతుందన్నారు. ఈ కార్యక్రమంలో దర్శిపర్రు, అలంపురం సొసైటీల అధ్యక్షులు గుండుమోగుల సాంబయ్య, కొలనువాడ సత్యనారాయణరాజు (దత్తుడు), పార్టీ నాయకులు దెందుకూరి సూర్యనారాయణరాజు, పెనుమర్తి తాతారావు, కాశీ, రాపాక కుమారి, కొలనువాడ సీతారామరాజు, మురళి, రావిపాడు నాయకులు ములగాల రామసత్యనారాయణ, పెంటపాడు, ముదునూరు వైద్యాధికారులు తోట రాజేష్, డాక్టర్ పూజిత, గ్రామ కార్యదర్శి బాబు, ప్రత్యేక వైద్యులు విజయ్ కుమార్, వంశీ(ఆర్థో), అహ్మద్ ఉన్నీసాబేగం (గైనకాలజీ), కంటి డాక్టర్ రాజేంద్రప్రసాద్, తహసిల్దార్ జీవీ శేషగిరి రావు, ఎంపీడీవో బాలాజీ, ఈవోపీఆర్డీ ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

అందరి సంపూర్ణ ఆరోగ్యం సీఎం జగన్ ధ్యేయం

తాడేపల్లిగూడెం రూరల్: అందరి సంపూర్ణ ఆరోగ్యమే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ధ్యేయమని వైస్ ఎంపీపీ కట్టా రంగబాబు అన్నారు. మంగళవారం మండలంలోని మెట్ట ఉప్పరగూడెం గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో వైస్ ఎంపీపీ కట్టా రంగబాబు మాట్లాడుతూ ఆరోగ్యవంతమైన సమాజం కోసం సీఎం జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారన్నారు. ఆరోగ్య సురక్ష సర్వేలో గుర్తించిన వారికి టోకెన్లు అందించి క్యాంపులకు తరలించడం జరుగుతుందన్నారు. సురక్ష శిబిరంలో గుర్తించిన వ్యాధులకు మందులు అందిస్తారని, అప్పటికీ నయం కాకపోతే ఉన్నత వైద్యానికి రిఫర్ చేస్తారన్నారు. ప్రతి ఒక్కరూ జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలను వినియోగించుకోవాలన్నారు. మండల సచివాలయాల కనీ వ్నర్ ముప్పిడి సంపత్‌కుమార్ మాట్లాడుతూ పాలనలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి విప్లవాత్మకమైన మార్పులు తీసుకొస్తున్నారన్నారు. దీనిలో భాగంగానే ప్రజల ఆరోగ్యానికి జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలని పేర్కొన్నారు. అనంతరం 1187మందికి వైద్యులు శ్రీహర్ష, సింధూ, పి.సుభాషి, జి.గౌతమి, పి.కాంచన ప్రియ వైద్య సేవలందించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మర్లపాటి వీరవెంకటసుబ్బలక్ష్మి, మండల ప్రత్యేకాధికారి ఎ.దుర్గేష్, ఎంపీడీవో ఎం.విశ్వనాథ్, సచివాలయ కార్యదర్శి గంటి మనీషా, సీహెచ్‌వోలు సి.శరత్‌బాబు, జి.సరిత, డి.ప్రియాంక, డి.చిట్టిబాబు, టి.సన్ని, ఏఎన్ఎంలు, ఆశ, అంగన్‌వాడీ కార్యకర్తలు, వలంటీర్లు, గృహసారథులు పాల్గొన్నారు.



ఇరగవరం: అయినపర్రులో జగనన్న ఆరోగ్య సురక్షలో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం



తాడేపల్లిగూడెం రూరల్: మెట్ట ఉప్పరగూడెంలో జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష సభలో మాట్లాడుతున్న వైస్ ఎంపీపీ కట్టా రంగబాబు

ముగిసిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలు

తణుకు టౌన్: గత నెల 30వ తేదీ నుంచి తణుకు మండలంలోని గ్రామ సచివాలయాల పరిధిలో చేపట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలు మంగళవారం ముగిశాయి. వేల్పూరు గ్రామంలో నెంబరు 2 మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో నిర్వహించిన ఈ శిబిరంలో వేల్పూరు 3 సచివాలయం పరిధిలో మొత్తం 1111 మందికి వైద్య పరీక్షలు చేసినట్లు ఎంపీడీవో కే కిరణ్‌కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమానికి మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు బోడపాటి వీర్రాజు ముఖ్యఅతిథిగా పాల్గొని వైద్యులు, వైద్య సిబ్బంది శిబిరాలలో అందించిన సేవలకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సొసైటీ అధ్యక్షుడు పెనుమర్తి వెంకట్రామన్న, గ్రామ వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు నున్న దుర్గా ప్రసాద్, వైస్ ఎంపీపీ ఐశెట్టి శేషుకుమారి, ఎంపీటీసీ చంద్ర శ్యామల, మండల ప్రత్యేక అధికారి పీ శ్రీనివాసరావు, ఈవోపీఆర్డీ రామకోటేశ్వరరావు, ఎంపీటీసీ విజయ దుర్గ, వైద్యులు డాక్టర్ టీఎల్ఎస్ హరిణి, డాక్టర్ కేఎంఆర్ కిషోర్, డాక్టర్ డీ రమేష్, బీ మోహిత్, డాక్టర ఎస్ సత్యనారాయణ, డాక్టర్ పృథ్వీ, వలంటీర్లు పాల్గొన్నారు.

ఇజ్రాయెల్ మారణహోమాన్ని ఆపాలి



నిరసన కార్యక్రమం నిర్వహిస్తున్న సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ నాయకుడు మామిడి దానవరప్రసాద్

తాడేపల్లిగూడెం రూరల్: అమెరికా ప్రోత్సాహంతో గాజాపై ఇజ్రాయెల్ సాగిస్తున్న మారణ హోమాన్ని ఆపాలని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా నాయకుడు మామిడి దానవరప్రసాద్ డిమాండ్ చేశారు. సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ కేంద్ర కమిటి పిలుపు మేరకు మంగళవారం మండలంలోని జగన్నాథపురం గ్రామంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. 75 ఏళ్లగా పాలస్తీనా ప్రజల్ని స్వదేశంలోనే కాందిశీకులుగా మార్చి నిరాశ్రయులను చేసి అమెరికా యుద్ధోన్మాదాన్ని తీవ్రంగా ఖండించారు. ఆయిల్ నిక్షేపాలను కాజేయడానికి అమెరికా అనేక కుట్రలు పన్నుతుందని, ఇజ్రాయేల్‌ను అడ్డం పెట్టుకుని దాడులు సాగిస్తుందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో ఎం.సత్తిబాబు, టి.దుర్గారావు, యర్రంశెట్టి సత్యనారాయణ, గోపీ దుర్గారావు, తోట సత్యనారాయణ, మంచాల శ్రీను, దువ్వ దానయ్య, తీపర్తి సత్యనారాయణ, సత్తయ్య, గాడ శేఖర్, తోట శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభ

మన చుట్టూ మనకు తెలియకుండానే
ఎంతో మంది రకరకాల బాధలకు లోనవుతుంటారు.
వారిలో ముఖ్యంగా వృద్ధులు, వికలాంగుల
సమస్యలకు సరైన పరిష్కారం తెలియక
ఇబ్బందులు పడుతుంటారు.
వారి మానాన వారిని అలాగే వదిలేయడం కన్నా
పరిష్కారాన్ని కనుగొంటాను అనుకున్నాడు.
తనదైన మార్గంలో ప్రయత్నించాడు.
విజయం సాధించాడు.
సత్కారాలను పొందుతున్నాడు
హైదరాబాద్ వాసి హేమేష్ చదలవాడ.


తల్లి సంధ్యతో హేమేష్ చదలవాడ

అమ్మమ్మలకు అండగా!

దేశవ్యాప్తంగా వివిధ రంగాలలో సేవలు అందించిన 21 ఏళ్ల లోపు 20 మంది యువ సాధకులను ఢిల్లీలో మొన్న జరిగిన 'అన్‌స్టాపబుల్ 21' వేదికగా సత్కరించారు. హ్యూమన్ స్టడీస్, సైన్స్, క్రీడలు, ఫైన్ ఆర్ట్స్, పెర్ఫార్మింగ్ ఆర్ట్, సోషల్ ఇంపాక్ట్, ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ అనే ఏడు రంగాలలో ప్రతిభావంతులైన యువతకు ఈ సత్కారాన్ని అందజేశారు. వారిలో హైదరాబాద్‌కు చెందిన 16 ఏళ్ల హేమేష్ చదలవాడ ఎలక్ట్రానిక్స్ రంగంలో కనబరిచిన ప్రతిభకు గుర్తింపు పొందాడు.

వృద్ధులకు సహాయం..

హేమేష్ పన్నెండేళ్ల వయసు నుంచి ఎలక్ట్రానిక్స్, రోబోటిక్స్ రంగంలో గణనీయమైన ప్రతిభను చూపుతున్నాడు. అల్జైమర్స్ వ్యాధితో బాధ పడుతున్న అమ్మమ్మను చూసి ఆమెకు ఏదైనా సాయం చేయాలనుకున్నాడు. తన ఆలోచనల గురించి హేమేష్ చెబుతూ 'నడిచేటప్పుడు అమ్మమ్మ అడుగులు తడబడుతుండేవి. మతిమరపు ఉండేది. ఆమెకు తన మీద తనకు కంట్రోల్ ఉండేది కాదు. కొన్నిసార్లు అర్ధరాత్రి మంచంపై నుంచి లేచి ఎటో వెళ్లిపోయేది. దీంతో ఆమెను కనిపెట్టి ఉండటం కష్టమయ్యేది. అమ్మమ్మకు, ఆమెను చూసుకునే మాకూ ఇదో సవాల్‌గా ఉండేది. కొన్ని అందుబాటులో ఉన్న డివైజ్‌లను ప్రయత్నించి చూశాం. కానీ, ఏ మాత్రం సంతృప్తిగా అనిపించలేదు. అమ్మమ్మకు సాయపడే డివైజ్‌ను నేనే సొంతంగా తయారుచేయాలనుకున్నాను' అని తనలో రూపుదిద్దుకున్న ఆలోచనను వివరిస్తాడు. హేమేష్ కృషి, పట్టుదల, అంకితభావానికి అతని తల్లిదండ్రులు కిశోర్, సంధ్యలు ప్రోత్సాహం అందించారు.


హేమేష్ తయారుచేసిన డివైజ్

> మా అమ్మమ్మ వయసున్న వారు ఎదుర్కొంటున్న ఎన్నో సమస్యలకు ఇది సరైన పరిష్కారం సూచిస్తుంది. ఎంతో మందికి సాయం చేస్తుందని ప్రామిస్ చేస్తున్నాను.
> – హేమేష్

పరికరం ఎలా పనిచేస్తుందంటే..

ఈ పరికరం వాచ్‌లాగా మణికట్టుకూ కట్టుకోవచ్చు. బ్యాడ్జ్‌గానూ ధరించవచ్చు. రోగి నడక, భంగిమ, శరీర ఉష్ణోగ్రత, నాడిని పర్యవేక్షిస్తుంది. నీళ్ల జారిపడుతుండే శబ్దాన్ని కూడా గుర్తించగలదు. మనిషి దూరంగా తిరుగుతున్నప్పుడు లేదా పడిపోవడం వంటి ప్రమాదంలో ఉన్నప్పుడు వెంటనే తెలియజేస్తుంది. ఇంకా అలారంలో 'పిల్‌బాక్స్' ఫీచర్ కూడా ఉంటుంది. ఇది రోగులు వారి మందులు తీసుకునే సమయం వచ్చినప్పుడు హెచ్చరికలను పంపుతుంది. 'ఈ డివైజ్ మా అమ్మమ్మ కోసం తయారుచేసినప్పుడు ఇంటర్నెట్ సరైన మార్గం చూపింది. అయితే, ఈ పరికరం పూర్తయ్యేసరికి అమ్మమ్మ చనిపోయారు' అని బాధపడే హేమేష్ డివైజ్ చేతిలో పట్టుకొని 'మా అమ్మమ్మ వయసున్న వారు ఎదుర్కొంటున్న ఎన్నో సమస్యలకు ఇది సరైన పరిష్కారం సూచిస్తుంది. ఎంతోమందికి సాయం చేస్తుందని ప్రామిస్ చేస్తున్నాను' అని చెబుతున్న హేమేష్ 12వ తరగతి చదువుతున్నాడు. తన తదుపరి ప్రాజెక్ట్స్‌తో ఎలక్ట్రానిక్స్, రోబోటిక్ రంగంలో మరిన్ని అడుగులు వేస్తున్నట్టుగా వివరించాడు.

2021లో ప్రధానమంత్రి చేతుల మీదుగా రాష్ట్రీయ బాల పురస్కారాన్ని అందుకున్నాడు. పేరున్న కంపెనీల నుంచి గ్రాంట్‌లను పొందాడు.


– నిర్మలారెడ్డి

మణిపూర్ ఒక మంచి వార్తను వినిపించింది.
ఆ రాష్ట్రానికి చెందిన మహిళా దర్శకురాలు మీనా లాంగ్‌జామ్ తీసిన
'ఆంద్రో డ్రీమ్స్' ముంబైలో జరుగుతున్న చలన చిత్రోత్సవంలో
బెస్ట్ డాక్యుమెంటరీగా ఎంపికైంది.
మణిపూర్‌లోని మారుమూల గ్రామం 'ఆంద్రో'లో ఆడపిల్లల
ఫుట్‌బాల్ క్లబ్‌ను 30 ఏళ్లుగా పరిస్థితులకు ఎదురీది నడుపుతున్న
'లైబి' అనే మహిళ పోరాటాన్ని ఈ డాక్యుమెంటరీ రికార్డు చేసింది.
ఆడపిల్లల క్రీడా స్వేచ్ఛను ఎన్ని అడ్డంకులొచ్చినా
కొనసాగనివ్వాలనే సందేశం ఇచ్చే ఈ డాక్యుమెంటరీ
దేశ, విదేశాల్లో ప్రశంసలు పొందుతోంది.

అడ్డంకులను దూరంగా తన్ని...


దర్శకురాలు: మీరా లాంగ్‌జామ్

న్యూస్‌మేకర్


ఆంద్రో డ్రీమ్స్ పోస్టర్

అంతా చేసి ఎనిమిది వేల మంది జనాభా మించని ఊరు ఆంద్రో. మణిపూర్ తూర్పు ఇంఫాల్ జిల్లాలో మారుమూల ఉంటుంది అది. అక్కడి ఆడపిల్లలు ఫుట్‌బాల్ ఆడితే ఏంటి... ఆడకపోతే ఏంటి? కాని 60 ఏళ్ల లైబి మాత్రం– ఆడాల్సిందే అంటోంది. ఆమె గత ముప్పై ఏళ్లుగా 'ఆంద్రో మహిళా మండల్ అసోసియేషన్– ఫుట్‌బాల్ క్లబ్' (అమ్మ– ఎఫ్‌సీ) నడుపుతోంది. ఈ క్లబ్‌కు నిధులు లేవు. బిల్డింగ్ లేదు. ఊళ్లో ప్రోత్సాహం లేదూ, ఏమీ లేదు. కాని లైబి మాత్రం అంతా తానై క్లబ్‌ను నడుపుతోంది. ఈ మధ్యే ఆమె ఒక పూరి పాక నిర్మించి దానినే క్లబ్ బిల్డింగ్‌గా ప్రారంభించుకుంది.

'అమ్మాయిలు కేవలం వంటకు, ఇంటి పనికి అంకితమై పోకూడదు. చదువుకోవాలి. ఆడాలి. ధైర్యంగా భవిష్యత్తును నిర్మించుకోవాలి. మా ప్రాంతంలో పురుషులదే సర్వాధికారం. ఇంటి పెద్ద, తెగ పెద్ద ఎంత చెప్తే అంత. వారి దృష్టిలో ఆడవాళ్ల గురించి చింతించాల్సింది ఏమీ ఉండదు. అమ్మాయిలు ఆడతామన్నా ఒప్పుకోరు. నా పోరాటం వల్లే ఇవాళ మా ఊరి నుంచి జాతీయ స్థాయిలో అమ్మాయిలు ఫుట్‌బాల్ ఆడుతున్నారు' అంటుంది లైబి.



తన ఫుట్‌బాల్ క్లబ్ పూరి పాక ముందు లైబి

ఈమె పోరాటం ప్రపంచానికి చెప్పదగ్గది అనిపించింది మణిపూర్‌కే చెందిన మహిళా దర్శకురాలు మీనా లాంగ్‌జామ్‌కు. అలా తయారైన డాక్యుమెంటరీనే 'ఆంద్రో డ్రీమ్స్'.

ఇద్దరి కథ

ప్రస్తుతం ముంబైలో 'జాగరణ్ ఫిల్మ్ ఫెస్టివల్' అట్టహాసంగా జరుగుతోంది. ఇందులో 'ఆంద్రో డ్రీమ్స్' బెస్ట్ డాక్యుమెంటరీగా నిలిచింది. ఇప్పటికే కేరళ, కొరియన్ ఫిల్మ్ ఫెస్టివల్స్‌కు ఎంపికైన ఈ డాక్యుమెంటరీ ముంబైలో విమర్శకుల్ని విశేషంగా ఆకట్టుకుంది. 'దీనికి కారణం ఆంద్రోలో అమ్మ క్లబ్‌ను నడుపుతున్న లైబి పోరాటాన్ని, ఆ క్లబ్‌లో గొప్ప ఫుట్‌బాల్ ప్లేయర్‌గా ఉంటూ మంచి భవిష్యత్తు నిర్మించుకోవాలనుకునే నిర్మల అనే అమ్మాయి ఆకాంక్షలని నేను చూపించడమే. ఒక రకంగా చాదస్త వ్యవస్థతో రెండు తరాల స్త్రీల పోరాటం ఈ డాక్యుమెంటరీ' అని తెలిపింది మీనా లాంగ్‌జామ్.

మణిపూర్ వెలుతురు

నిజానికి మే 3వ తేదీ నుంచి మణిపూర్ వేరే కారణాల రీత్యా వార్తల్లో ఉంది. కాని మణిపూర్‌ను అభిమానించేవారికి ఇప్పుడు ఈ డాక్యుమెంటరీ సాధిస్తున్న విజయాలు సంతోషాన్ని ఇస్తున్నాయి. 'నా డాక్యుమెంటరీ విజయం మా ప్రాంతంలో గతాన్ని మర్చిపోయి కొత్త జీవితం మొదలుపెట్టే ఉత్సాహాన్ని ఇస్తే అంతే చాలు' అంది మీనా లాంగ్‌జామ్. మణిపూర్ యూనివర్సిటీలో కల్చరల్ స్టడీస్‌లో ప్రొఫెసర్‌గా ఉన్న మీనా పాఠాలు చెప్పడంతో పాటు డాక్యుమెంటరీలు కూడా తీస్తుంది. 2015లో ఆమె మణిపూర్‌లో ఫస్ట్ మహిళా ఆటోడ్రైవర్‌గా ఉన్న లైబీ ఓయినమ్ మీద డాక్యుమెంటరీ తీస్తే దానికి చాలా పేరొచ్చింది. ఆ తర్వాత 'అచౌబీ ఇన్ లవ్' పేరుతో పోలో ఆటకు అనువైన స్థానిక జాతి అశ్వాలపై డాక్యుమెంటరీ తీస్తే దానికీ పేరొచ్చింది. ఇప్పుడు 'ఆంద్రో డ్రీమ్స్' మణిపూర్ ఘనతను చాటుతోంది.

బాలికలు, యువతులు క్రీడల్లో ఎంతో రాణిస్తున్నా ఇంకా గ్రామీణ ప్రాంతాల్లో ఆంక్షలు ఉండనే ఉంటాయి. అలాంటి ప్రతి చోట అమ్మాయిలను ప్రోత్సహించే లైబి లాంటి యోధురాళ్లు, వారి గెలుపు గాథలను లోకానికి తెలిపే మీనా లాంటి వాళ్లు ఉండాలని కోరుకుందాం.

యూత్ పల్స్

ఢీ అంటే ఢీ

ఆర్ట్ ఆఫ్ డీఇన్‌ఫ్లుయెన్సింగ్

'ఇప్పటి వరకు ఇన్‌ఫ్లుయెన్సర్ పవర్ ఏమిటో చూశారు. ఇక డీఇన్‌ఫ్లుయెన్సర్ పవర్ ఏమిటో చూసే టైమ్ వచ్చింది'... ఇది తెలుగు సినిమాలో మాస్ డైలాగ్ కాదు. సోషల్ మీడియాలో ఒక కుర్రాడు పెట్టిన కామెంట్.

సోషల్ మీడియాలో ఇన్‌ఫ్లుయెన్సర్‌ల హవా నడుస్తున్న కాలం ఇది. కస్టమర్‌లు ఏది కొనాలో, ఏ షో చూడాలో, ఎలాంటి ఆరోగ్య సూత్రాలు పాటించాలో చెబుతున్నారు. ఇప్పుడు ఈ ట్రెండ్‌కు అడ్డుపడే 'డీఇన్‌ఫ్లుయెన్సింగ్' ట్రెండ్ యువతరం నుంచే వచ్చి బలపడుతోంది. ట్రెడిషనల్ ఇన్‌ఫ్లుయెన్సర్‌లు ఒక ప్రాడక్ట్‌ను హైప్ చేస్తే డీఇన్‌ఫ్లుయెన్సర్‌లు ఆ హైప్‌ను ఛాలెంజ్ చేస్తున్నారు....





మార్కెటింగ్ డాటా అండ్ ఎనలిటిక్స్ కంపెనీ కంతార్ స్టడీ రిపోర్ట్ ప్రకారం వినియోగదారులపై ఇన్‌ఫ్లుయెన్సర్‌ల సిఫారసుల ప్రభావం తక్కువేమీ కాదు. సోషల్ మీడియాలో ఎటు చూసినా ఇన్‌ఫ్లుయెన్సర్‌లు కనిపిస్తారు. టీ పొడుల నుంచి టీపాయ్‌ల వరకు రకరకాల ప్రాడక్ట్స్‌ను ప్రమోట్ చేయడానికి చిన్నచిన్న క్యాచీ వీడియోలను రూపొందిస్తారు. దీనికి భిన్నంగా ఒక ప్రాడక్ట్‌ను విశ్లేషిస్తూ విమర్శిస్తే...అదే డీఇన్‌ఫ్లుయెన్సింగ్!

'డీఇన్‌ఫ్లుయెన్సింగ్' హ్యాష్‌ట్యాగ్‌తో టిక్ టాక్‌లో ఈ ట్రెండ్ మొదలైంది.

సోషల్ మీడియా ఎనాలటిక్స్ ఫర్మ్ ట్యూబ్‌లర్ ల్యాబ్స్ చెబుతున్నదాని ప్రకారం గత సంవత్సరం నుంచి ఈ ట్రెండ్ ఊపందుకుంది. మ్యాడి వెల్ అనే ఇన్‌ఫ్లుయెన్సర్ ప్రముఖ కాస్మటిక్ స్టోర్స్‌లో పని చేసింది. కొన్ని ప్రాడక్ట్స్ పట్ల కస్టమర్‌లు ఎందుకు విముఖంగా ఉన్నారో తన స్వీయ అనుభవాలను తెలియజేసింది. ఈ ప్రభావంతో ఆమె పేరు ఇన్‌ఫ్లుయెన్సర్‌ల జాబితా నుంచి డీఇన్‌ఫ్లుయెన్సర్‌ల జాబితాలోకి చేరింది.

న్యూయార్క్‌కు చెందిన ఇరవై సంవత్సరాల క్లారా కొన్ని బ్రాండ్‌లను విమర్శిస్తూ వీడియోలు చేసింది. వాటిలో ఒకటి వైరల్‌గా మారింది. అదే సమయంలో తాను విమర్శించిన బ్రాండ్ నుంచి ఎలాంటి స్పందన వస్తుందో అనే భయం పట్టుకుంది. అయితే తనకు తానుగా ధైర్యం తెచ్చుకోవడానికి ఎంతో సమయం పట్టలేదు.

'నేను సరియైన వివరాలతోనే వీడియో చేశాను. నేనెందుకు భయపడాలి' అంటోంది క్లారా.

మన సెలబ్రిటీ ఒకరు ఆరోగ్య సంబంధమైన విషయాలపై కాస్త లోతుగానే మాట్లాడాడు. అయితే ఆయన అవగాహన లోపాన్ని ఒక వైద్యుడు వెంటనే ఎత్తిచూపాడు. పాపులర్ చైనీస్ వ్లోగర్ ఒకరు తన వయసు తక్కువగా కనిపించేలా సాంకేతిక మాయ చేస్తే ఎవరో కుర్రాడు కనిపెట్టి 'ఆయన అసలు రూపం ఇది' అని చూపాడు.

స్వీడన్ ఇన్‌ఫ్లుయెన్సర్ ఫేక్ ట్రిప్ గురించి మరొక యువకుడు 'ఇవి ఫొటోషాప్ చిత్రాలు' అని నిజాన్ని బహిర్గతం చేశాడు. నిజానికి ఇలాంటివి సోషల్ మీడియాలో గతంలో లేవని కాదు. అయితే 'డీఇన్‌ఫ్లుయెన్సింగ్' పుణ్యమా అని 'అది కాదు ఇది' అని వెంటనే సాధికార సమాచారంతో స్పందించే ధోరణి పెరిగింది.

డీఇన్‌ఫ్లుయెన్సర్‌లు ఓవర్–హైప్‌డ్ ప్రాడక్ట్స్‌ను విమర్శించడమే కాదు చౌక ధరల్లో లభించే వాటి గురించి చెబుతున్నారు.

యూనివర్శిటీ ఆఫ్ పెన్సిల్వేనియాలోని వార్టన్ స్కూల్ ఆఫ్ బిజినెస్‌లో ప్రొఫెసర్ అయిన అమెరికస్ రీడ్ ఇలా అంటున్నారు... 'ఇన్‌ఫ్లుయెన్సర్‌లలో ఎక్కువ మంది సాధికారికంగా మాట్లాడడం లేదేమో అనే భావన కస్టమర్‌లలో వచ్చింది. డబ్బులు ఇస్తారు కాబట్టి సంబంధిత ప్రాడక్ట్స్‌ను ప్రమోట్ చేస్తారు. నిజానిజాల గురించి వారికి అవసరం లేదు. ఈ నేపథ్యంలో కాస్తో కూస్తో డీఇన్‌ఫ్లుయెన్సర్‌నే నయం అనుకుంటున్నారు. నిజానికి డీఇన్‌ఫ్లుయెన్సర్ కూడా ఇన్‌ఫ్లుయెన్సర్‌నే'

కొందరు ఒక అడుగు ముందుకు వేసి ఈ ట్రెండ్‌కు 'యాంటీ క్యాపిటలిస్ట్' ట్రెండ్‌గా నామకరణం చేశారు.

డీఇన్‌ఫ్లుయెన్సింగ్ ట్రెండ్ వల్ల వృథా ఖర్చులు తగ్గుతాయని, వేలం వెర్రికి అడ్డుకట్టపడుతుందని, పర్యావరణ కోణంలో కూడా ఈ ట్రెండ్ వల్ల మేలు జరుగుతుందని యువతరంలో ఎంతోమంది బలంగా వాదిస్తున్నారు. తమ అభిప్రాయాలను సామాజిక మాధ్యమాలలో ఇతరులతో పంచుకుంటున్నారు. అయితే 'డీఇన్‌ఫ్లుయెన్సింగ్' ట్రెండ్‌పై ప్రశంసలతో పాటు విమర్శలు కూడా ఉన్నాయి.

డీఇన్‌ఫ్లుయెన్సింగ్‌కు విషయ సాధికారత, నిజాయితీ అనేవి కీలకం. అయితే 'డీఇన్‌ఫ్లుయెన్సింగ్' రూపంలో సూడో–అథెంటిసిటీ ముందుకు వస్తుందని, ఈ ట్రెండ్‌ను తమ స్వార్థానికి ఉపయోగించుకునే వారి సంఖ్య పెరుగుతుందనే విమర్శ ఉంది.

'ఈ ట్రెండ్ కాస్త చివరికి ఎలా మారుతుందంటే ఇది కొనవద్దు. మీరు కొనాల్సింది అది అన్నట్లుగా!' అంటుంది 26 సంవత్సరాల అమెరికన్ ఇన్‌ఫ్లుయెన్సర్ జెస్సిక.

'ముఖ్యమైన విషయం ఏమిటంటే ఇన్‌ఫ్లుయెన్సర్‌లు చెప్పగానే కస్టమర్‌ల అభిప్రాయాలు రాత్రికి రాత్రి మారిపోవు. ఇన్‌ఫ్లుయెన్సర్‌లు కేవలం సలహా ఇస్తారు. అంతే. ఏది కొనాలి, ఏది కొనకూడదు అనే స్వీయవిచక్షణ కస్టమర్‌లలో ఉంది. ఇన్‌ఫ్లుయెన్సర్‌లుగా మేము పారదర్శకంగా, నిజాయితీగా ఉంటాం' అంటుంది ఫ్రాన్స్‌కు చెందిన ఇన్‌ఫ్లుయెన్సర్ కోలిన్. ఆమెకు ఇన్‌స్టాగ్రామ్‌లో 4,00,000 ఫాలోవర్స్ ఉన్నారు.

ప్రస్తుతం డీఇన్‌ఫ్లుయెన్సింగ్ ట్రెండ్ హెల్త్, ఫైనాన్స్, లైఫ్‌స్టైల్ విభాగాలలో ఎక్కువగా కనిపిస్తుంది.

'డీఇన్‌ఫ్లుయెన్సింగ్ అనేది వాపా బలుపా?' అనేది పక్కన పెడితే ఈ ట్రెండ్ మూలంగా ఇన్‌ఫ్లుయెన్సర్‌లు ప్రాఫిట్‌కు మాత్రమే కాదు మెరిట్‌కు కూడా ప్రాధాన్యత ఇచ్చే ధోరణి, జవాబుదారీతనం పెరుగుతుంది.

> సమస్య ఇన్‌ఫ్లుయెన్సర్‌లు కాదు. కొందరు ఇన్‌ఫ్లుయెన్సర్‌లు అనుసరిస్తున్న ధోరణి. వారిలో మార్పు రావాలి. సామాజిక బాధ్యత పెరగాలి. యువతలో అశాంతి, ఆందోళన రేకెత్తించే కంటెంట్‌కు దూరంగా ఉండాలి.
> – హిమాద్రి పటేల్, డిజిటల్ క్రియేటర్

● ఆటో అన్సారీ

లైఫ్ గేర్ మార్చింది


నజ్మా అన్సారీ

ఓ యువకుడు యాచకుడి వేషంలో, కేజీల మొత్తంలో కరెన్సీ నాణేలను తీసుకుని ఐఫోన్ కొనడానికి వెళ్లిన వార్త ఇటీవల సోషల్ మీడియాలో తెగ వైరల్ అయింది. మంచి వయసు, ఓపిక ఉన్న వారే ఇలా చేస్తుంటే... ఓపిక లేకపోయినా సమాజంలో గౌరవంగా బతికేందుకు బురఖా వేసుకుని ఆటో నడుపుతోంది నజ్మా అన్సారీ. అయినా ఇతరుల ముందు చేయి చాచే కంటే.. కష్టపడడమే గౌరవం అనుకుంది. 'గేర్లు మార్చేయండి చాలు గౌరంగా బతకవచ్చు' అని చెబుతూ ఎంతో మందికి ప్రేరణగా నిలుస్తోంది.



నజ్మా అన్సారీ వయసు 45. ఉత్తరప్రదేశ్, మొరాదాబాద్ నగరంలోని కట్‌ఘర్‌లో ఆమె నివసిస్తోంది. ఆమెకు ఇద్దరు పిల్లలు. 2010లో భర్త మరణించడంతో ఇంటి భారం ఆమె మీద పడింది. అప్పటిదాక గృహిణిగా ఉన్న నజ్మాకు తన కొడుకు, కూతుర్ని ఎలా పెంచాలో అర్థం కాలేదు. భర్త నడిపిన టీషాపును అద్దె కట్టలేక వదిలేసింది. ఇంట్లోనే టీ తయారు చేసి విక్రయించింది. అలా పిల్లల అవసరాలు చూసుకుంటూ ఉండగానే భర్త ఇన్సురెన్స్ డబ్బులు రూ.4.35 లక్షలు వచ్చాయి. మూడు లక్షల రూపాయలతో 2015లో కూతురికి పెళ్లి చేసింది.

ఆదాయం సరిపోక..

టీ స్టాల్ నడుపుతూ కుటుంబాన్ని లాక్కొస్తున్న నజ్మాకు డబ్బులు సరిపోయేవి కావు. కూతురి పెళ్లి తరువాత ఆర్థిక ఇబ్బందులు పెరిగాయి. దీంతో భర్త ఇన్సురెన్స్ డబ్బుల్లో మిగిలిన మొత్తంతో ఎలక్ట్రిక్ ఆటో కొనుక్కుంది. ఇంటి పనులన్నీ పూర్తిచేసి ఆటో తోలుతూ సంపాదిస్తోంది.

అర్ధరాత్రైనా భయం లేదు

నజ్మా మూడు షిఫ్టుల్లో ఆటో నడుపుతోంది. బురఖా ధరించి ఉదయం తొమ్మిదిగంటలకు ఆటో స్టార్ట్ చేస్తుంది. ఎండ వేడికి బురఖాలో ఎక్కువ సమయం ఉండలేక మధ్యాహ్నం ఒంటి గంటకు ఇంటికి వచ్చేస్తుంది. తిరిగి సాయంత్రం ఆరు గంటల నుంచి రాత్రి ఎనిమిది వరకు ఆటో నడుపుతోంది. మళ్లీ రాత్రి తొమ్మిది నుంచి రెండుగంటల వరకు విరామం లేకుండా నడుపుతుంది. ఇలా మూడు షిఫ్టుల్లో మొత్తం మీద రోజుకి ఐదు నుంచి ఆరు వందల వరకు సంపాదిస్తోంది. స్థానిక ట్రాఫిక్ పోలీసులు నజ్మా ధైర్యాన్ని మెచ్చుకుని ప్రోత్సహిస్తున్నారు. అయితే నజ్మాను చూసిన ఓ హిందూ మహిళ కూడా ఆటో నడపడం మొదలు పెట్టింది. దీంతో ఆ మహిళ ఆర్థిక పరిస్థితులు కూడా మెరుగు పడ్డాయి. ఇలా ఇతరులకు స్ఫూర్తి నిలుస్తూనే, తన కష్టార్జితంతో హజ్ యాత్రకు వెళ్తానని చెబుతోంది నజ్మా.

అడుక్కునే కంటే...

''పేదరికం ఉందని అక్కడా ఇక్కడా చేయి చాచకుండా కష్టపడి ఏ పనైనా చేసి గౌరవంగా బతకవచ్చు. ఆటో గేర్లు మారుస్తూ, ప్రయాణికులను గమ్యాలకు చేరుస్తున్నాను. ఇక మహిళా డ్రైవర్‌గా నాకు రాత్రి సమయాల్లో కూడా ఎటువంటి ఇబ్బంది ఎదురు కాలేదు. ముఖ్యమంత్రి యోగి ప్రభుత్వం వచ్చాక అర్ధరాత్రి బయటకు రావడానికి కూడా భయం వేయడం లేదు. ప్రభుత్వ అధికార యంత్రాంగం మాకు రక్షణ కల్పిస్తోంది. పరిస్థితులు మరింత దిగజారినప్పుడు అల్లా కాపాడతాడు'' అని నజ్మా అన్సారీ ధైర్యంగా చెబుతోంది.

బ్యూటిప్స్





● వేప చెట్టు ఇంటి దగ్గర్లో ఉంటే వేరే సౌందర్యసాధనాలతో పనే ఉండదు. వేపాకులు, బెరడు, వేపనూనె ఔషధాలుగానే కాదు, సౌందర్య సాధనాలుగానూ ఉపయోగపడతాయి. ఎలాంటి చర్మ సమస్యలకైనా వేపతో ఇట్టే చెక్ పెట్టేయవచ్చు. ● ముఖంపై మొటిమలు, నల్లమచ్చలు ఏర్పడుతుంటే వేపాకులతో చక్కని విరుగుడు ఉంది. గుప్పెడు వేపాకులను అరలీటరు నీటిలో వేయాలి. వేపాకులు పూర్తిగా మెత్తగా మారిపోయేంత వరకు ఆ నీటిని మరిగించాలి. కాసేపటికి నీరు ఆకుపచ్చ రంగులోకి మారుతుంది. అప్పుడు వడగట్టి ఆ కషాయాన్ని సీసాలో భద్రపరచుకోవాలి. ప్రతిరోజూ రాత్రి పడుకునే ముందు ఆ నీటితో కాస్త దూదిని తడిపి ముఖాన్ని రుద్దుకుంటే చాలు. మొటిమలు, మచ్చలు మటుమాయం అవుతాయి. ● చర్మం పొడిబారి, తరచు దురదలు పెడుతున్నట్లయితే, పైన చెప్పుకున్నట్లే వేపాకులతో కషాయం చేసి, బకెట్ నీటిలో ఒకకప్పు కషాయాన్ని పోసి ఆ నీటిని స్నానానికి ఉపయోగిస్తే చాలు. కొద్దిరోజుల్లోనే చర్మం ఆరోగ్యకరంగా మారుతుంది. ● ముఖం తరచు జిడ్డుగా మారుతుంటే, వేపాకుల పొడి, గంధంపొడి, గులాబి రేకుల పొడి సమభాగాలుగా తీసుకుని కలుపుకోవాలి. చెంచాడు పొడిలో మూడు నాలుగు చుక్కల వేపనూనె, కొద్దిగా తేనె, నిమ్మరసం పిండుకుని ముద్దలా కలుపుకోవాలి. దానిని ముఖానికి పట్టించి, అరగంటసేపు ఆరనివ్వాలి. పూర్తిగా ఆరిన తర్వాత గోరువెచ్చని నీటితో కడిగేయాలి. ఇలా చేస్తే ముఖం తాజాగా మారుతుంది.